


నిత్య కల్యాణస్వామికి

# “నిత్తైశ్వర్యోభవ”!

**నూతన పట్టువస్త్రాల్లో మెరిసిన ఏడుకొండలదేవుడు ఆగమోక్తంగా ఆణివార ఆస్థానం**



తిరుమల, జులై 17ప్రభాతవార్తప్రతినిధి:

నిత్యకల్యాణంపచ్చతోరణంగా విరాజిల్లుతున్న శ్రీవేంకటేశ్వరస్వామిని "నిత్తైశ్వర్యోభవ:"అని దీవించే ఆణివార ఆస్థానం పర్వదినం ఆగమోక్తంగా జరిపించారు. ఆలయంలోపల ఘంటామండపంలో గరుత్మంతునికి అభిముఖంగా జరిపించే ఆస్థానంలో సర్వభూపాల వాహనంలో శ్రీదేవిభూదేవి సమేత మలయప్పస్వామి కొలువుకు వేంచేపుచేశారు. మరోపీఠంపై విశ్వక్సే నులవారిని కొలువుదీర్చారు. ఆలయంలోపల ఆనందనిలయంలోని బంగారువాకిలిలో ఆస్థానంలో ఉత్స వమూర్తులకు ప్రత్యేకపూజలు, ప్రసాదాలు నివేదించారు. అనంతరం అర్చకులు పెద్దజీయర్ ,చిన్న జీయర్, టిటిడి తరపున ఇఒ ఏవిధర్మారెడ్డికి లచ్చన తాళపు చెవి గుత్తిని చేతికి తగిలించి హారతి ,చదనం, తాంబూలం,తీర్థం,శఠారి మర్యాదలతో ఆణివార ఆస్థానం ముగిసింది. ఈ కార్యక్రమంలో టిటిడి అధికారులు పాల్గొన్నారు.

**శ్రీరంగం నుండి పట్టువస్త్రాలు**

అణివార ఆస్థానం పర్వదినం సందర్భంగా తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీరంగం శ్రీరంగనాథస్వామివారి ఆలయ అధికారులు శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించారు.

## జగనన్న సురక్షలో ప్రతి కుటుంబం కవర్ కవరేజ్

**జిల్లా కలెక్టర్ వెంకటరమణ రెడ్డి**

*తిరుపతి కలెక్టరేట్, జులై 17, ప్రభాతవార్త*

*జగనన్న సురక్షలో ప్రతి కుటుంబం కవర్ చేయాలని వాలంటర్లు సచివాలయ సిబ్బంది నిర్దేశించిన మేరకు ఓపిగ్గా సర్వే చేపట్టి కుటుంబాలకు కావాల్సిన దృవ పత్రాలు అందించాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ కె. వెంకట రమణా రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి అమరావతి నుండి సిఎంఓ స్పెషల్ సిఎస్ పూనం మాలకొండయ్య అన్ని జిల్లాల కలెక్టర్లతో స్పందన, జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష కార్యక్రమాలపై వర్చువల్ విధానంలో సమీక్ష నిర్వమించగా తిరుపతి కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి డిఎల్‌డిఓలు ఆదిశేషారెడ్డి, సుశీల దేవి హాజరైయ్యారు. వర్చువల్ సమీక్ష అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న సురక్ష ఒక మంచి కార్యక్రమం అని జిల్లాలో 691 సచివాలయాల పరిధిలో 397 సచివాలయాల సర్వే నిర్వహించి 3 లక్షల 22 వేల కుటుంబాల కవర్ చేయగలిగామని అన్నారు. ఎప్పటికప్పుడు మానిటర్ డిఎల్‌డిఓ సుశీల దేవి ప్రత్యేక శ్రద్ధ పెట్టి ప్రతి కుటుంబం కవర్ చేయాలన్నారు. స్పందన వినతులకు జగనన్నకు చెబుదాం వినతులు అర్ధవంతంగా పరిష్కారం చూపాలని ఆడిట్‌లో తిరిగి ఓపెన్ కారాదని ఇచ్చే ప్రతి జవాబు ఖచ్చితంగా వుండాలి అర్జీ దారులకు అర్ధమయ్యేలా వివరించాలని సూచించాలని అన్నారు.*

## కన్నులపండువగా అమావాస్య ఉత్సవం

శ్రీకాళహస్తి, జూలై 17 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం విశేష సంఖ్యలో భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అమావాస్య సందర్భంగా ఆలయంలోని అలంకార మండపంలో స్వామిఅమ్మవార్లను చక్కగా ముస్తాబుచేసి పల్లకీపై ఆశీనుల్నిచేసి హారతులిచ్చారు. అనంతరం పల్లకీపై స్వామిఅమ్మవార్లను ఆశీనుల్నిచేసి పురవీధుల్లో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. పలువురు భక్తులు స్వామిఅమ్మవార్లకు హారతులిచ్చి దర్శనం చేసుకున్నారు. ఉత్సవంలో పలువురు ఆలయాధికారులు పాల్గొన్నారు.

# కార్యకర్తల కోసం ఎంత దూరమైనా వెళ్తా

## జనసేనాని పవన్‌కల్యాణ్



రేణిగుంట, జూలై 17 ప్రభాతవార్త:

కార్యకర్తలకు అన్యాయం జరిగితే ఎంత దూరమైనా వెళ్తానని జనసేనాని పవన్‌కల్యాణ్ అన్నారు. గత కొద్ది రోజుల క్రితం జన సైనికుడు కొట్టేశాయిపై శ్రీకాళహస్తిలో ఒక సీఐ చేయి చేసుకున్నదన్న విషయంపై తిరుపతి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయడానికి జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ప్రత్యేక విమానంలో సోమవారం రేణిగుంట చేరుకున్నారు. ఆయనతోపాటు రాష్ట్ర జనసేన నాయకులు నాదెండ్ల మనోహర్ వచ్చారు. వీరికి పెద్ద సంఖ్యలో జన సైనికులు స్వాగతం పలికారు. అనంతరమైన రోడ్డు మార్గంలో అభిమానులతో కలసి ర్యాలీగా తిరుపతి ఎస్పీ ఆఫీసుకు వెళ్లారు. అక్కడ శ్రీకాళహస్తిలో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారిపై ఫిర్యాదు చేశారు. అనంతరం తిరుగు ప్రయాణంలో రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్యకర్తల కోసం ఎంత దూరమైనా వెళ్తానన్నారు. శ్రీకాళహస్తిలో ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరిగిందన్నారు. జన సైనికుడు కొట్టేశాయిపై పోలీసు అధికారి చేయి చేసుకోవడాన్ని తప్పు పట్టారు. 2011వ సంవత్సరంలో రామ్‌లీలా మైదానంలో జరిగిన దాడిని సుప్రీం కోర్టు ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కింద పేర్కొనడాన్ని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డికి తెలియజేశామన్నారు. ఎవరైనా శాంతియుతంగా నిరసన తెలియజేయడం రాజ్యాంగ హక్కు అన్నారు. శ్రీకాళహస్తిలో ప్రాథమిక హక్కులకు ఉల్లంఘన జరిగిందన్నారు. ఈ విషయమై ఎస్పీకి ఫిర్యాదు చేశామన్నారు. ఎస్పీ సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామన్నారన్నారు. జనసేన కార్యకర్తలు క్రమశిక్షణకు మారుపేరన్నారు. పోలీసు శాఖకు అధికార పార్టీ నుంచి ఒత్తిళ్లు ఉంటాయన్నారు. దీనిని అర్థం చేసుకోగలమన్నారు. అయితే ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తే ఊరుకోమన్నారు. మానవ హక్కుల కమిషన్ న్యాయమూర్తి ఈ విషయాన్ని సుమోటోగా తీసుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఇలా చేయడం భవిష్యత్‌లో అందరికి గుణపాఠం అవుతుందన్నారు. తామంతా క్రమశిక్షణతో ఉంటామని, అదే విధంగా ప్రభుత్వం పోలీసులను ఇష్టారాజ్యంగా వాడుకోవద్దని హితవు పలికారు. అనంతరం ఆయన ప్రత్యేక విమానంలో ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. స్వాగతం, వీడ్కోలు, ర్యాలీ, విలేకరుల సమావేశంలో పాల్గొన్న వారిలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, చిత్తూరు జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్, శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి కోటా వినుత, జనసేన నేతలు రాందాస్ చౌదరి, కల్యాణం శివ శ్రీనివాస్, పెద్ద సంఖ్యలో జన సైనికులు పాల్గొన్నారు.



## శ్రీకాళహస్తి ఘటనపై ఎస్పికి ఫిర్యాదు చేసిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్

తిరుపతి క్రైం, జులై 17, ప్రభాతవార్త

శ్రీ కాళహస్తిలో జనసేన జిల్లా కార్యదర్శి కొట్టే సాయి పై వన్ టౌన్ సిఐ అంజు యాదవ్ చేయి చేసుకున్న ఘటనపై తిరుపతి జిల్లా ఎస్పి పరమేశ్వర్ రెడ్డికి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సిఐ పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసారు. ఈ సందర్భంగా ఎస్పి పవన్ కళ్యాణ్, నాదేళ్ళ మనోహర్‌లతో చర్చిస్తూ మీరు వాలంటీర్లపై చేసిన అవాస్తవ ఆరోపణలు వల్లే రాష్ట్ర వ్యాప్తంగా శాంతి భద్రతల సమస్య ఉత్పనమైందన్నారు. అందులో భాగంగానే శ్రీకాళహస్తిలో ఘటన చోటు చేసుకుందని గుర్తు చేసారు. అవాస్తవాలు ప్రజలకు చెప్పి అలజడి సృష్టించారని వారిరువురిని ఎస్పి అడిగారు. అనంతరం గడిచిన 4 సంవత్సరాలలో ఎన్‌సిఆర్‌బి ఘణాంకాలను వారికి చూపి లభ్యమైన మహిళలు ఎవరు కూడా వాలంటీర్లపై ఎలాంటి ఫిర్యాదు చేయలేదన్నారు. ఈ పరిణామాలకు సమాధానం ఏమిటని ప్రశ్నించారు. అందుకు వారు సమాధానం చెప్తామని మాటలు దాటవేసారు.

# ప్రజలను ఓట్లు అడిగే హక్కు మాకుంది..

**రాష్ట్ర మంత్రి డా॥ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి**
**మున్సిపల్ ఎన్నికల్లోనే తెదేపాకు చెల్లుచీటీ..**
**కుప్పంలో వైకాపా గెలవడం తథ్యం !!**



కుప్పంలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న మంత్రి డా॥ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కుప్పం, జూలై 17 ప్రభాతవార్త

ప్రజలు మేలు చేస్తున్న తమకు ప్రజలను ఓట్లు అడిగే హక్కు ఉందని, ప్రజలను కష్టంలో ఆదుకున్న వాడే నాయకుడు అని రాష్ట్ర అటవీ,గనులు, విద్యుత్‌శాఖ మంత్రి డా॥ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం కుప్పం మున్సిపాలిటీలో మంత్రి 18వార్డుల పరిధిలో మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ అధ్వర్యంలో జరిగిన వార్డుబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. కరోనా సమయంలో ప్రజలను సిఎం జగన్ ఆదుకున్నారని అదే ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు పొరుగు రాష్ట్రంలో నాలుగు గోడల మధ్య దాక్కున్నారని విమర్శించారు. ప్రజలను ఆదుకోనివారు నాయకుడు కాదని పేర్కొన్నారు. కుప్పంలో చంద్రబాబునాయుడు అద్దెనాయకుడిగా ఎమ్మెల్సీ శ్రీకాంత్‌ను తెచ్చుకున్నారని ఆయనకు ఓ వార్డులో గెలిపించే శక్తి ఉందా అని ప్రశ్నించారు. కుప్పంలో ఈసారి వైకాపా గెలవడం ఖాయమని లక్ష మెజార్టీ సాధిస్తామని పేర్కొన్నారు. కుప్పంలో మున్సిపాలిటీ ఎన్నికల్లోనే ప్రజలు తెలుగుదేశం పార్టీకి చెల్లుచీటి రాశారన్నారు. కుప్పంలో చంద్రబాబు నాటకాలు ఆడి ఓట్లేయించుకుని గెలిచారని విమర్శించారు.నామినేషన్లకు కూడా రాకుండా తన తాబేదార్ల దౌర్జన్యంతో కుప్పంలో గెలిచేవారని వ్యాఖ్యలు చేశారు. 14 ఏళ్ల సిఎంగా ఉన్న చంద్రబాబు పాలనలో అభివృద్ధి ఏం జరిగిందని ప్రశ్నించారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి పేదరికాన్ని చేసి పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కుప్పం మున్సిపాలిటీకి 60కోట్లు కేటాయించారని, అలాగే అమృత్ పథకంలో 16 కోట్లతో ఇంటింటికీ స్వచ్ఛజలాలు అందిస్తామన్నారు. ప్రజలు కూడా ఎవరు సాయం చేస్తున్నారు, అభివృద్ధి చేస్తున్నారు అని ఆలోచించి ఓట్లేయాలన్నారు. మహిళల కష్టాలు పాదయాత్రలో చూసిన సిఎం జగన్ అమ్మఒడి, విద్య, వసతి దీవెనతో పాటు మహిళలు తీసుకున్న 27వేల కోట్ల బ్యాంకురుణాలు కూడా చెల్లిస్తున్నారన్నారు. 3200రోగాలను ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చారన్నారు. జిల్లాకో మెడికల్ కాలేజ్, ఆస్పత్రులు కట్టించడం జరుగుతోందన్నారు. విద్య, వైద్యం, సంక్షేమం కోసం సిఎం జగన్ దార్శనికతతో పనిచేస్తూ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. పేదల పిల్లలను ప్రభుత్వమే చదివిస్తుందన్నారు. సిఎం జగన్ రాజకీయాలకు అతీతంగా పథకాలు అందిస్తున్నారని మరలా గెలిపిస్తే మరింత మెరుగైన పాలన అందిస్తామన్నారు. గతంలో పెన్షన్లు తెలుగుదేశంపార్టీ నేతల బంధువులకు, కార్యకర్తలకు ఇచ్చేవారన్నారు. నేడు వాలంటీర్ల ద్వారా అర్హులకు ప్రతినెలా 1వతేదిన అందించడం జరుగుతోందన్నారు. మహిళలను మోసగించిన చంద్రబాబును మహిళలు నిలదీయాలన్నారు. కుప్పం ఎమ్మెల్యేగా భరత్‌ను, చిత్తూరు ఎంపిగా రెడ్డెప్పను గెలిపించాలని కోరారు. చిత్తూరు ఎంపి రెడ్డెప్ప మాట్లాడుతూ మంత్రి రామచంద్రారెడ్డి ఎక్కడ అడుగు పెడితే అక్కడ విజయం తథ్యమన్నారు. తాము మంచితనంతోనే విజయాలు సాధిస్తున్నామన్నారు. ప్రతి ఇంటికి ఎంత డబ్బులు వచ్చాయి అని మహిళలు ఆలోచించాలన్నారు. కుప్పంలో వైకాపా నేతలు, తాము ఎవరైనా లంచాలు అడిగితే మంత్రికి ఫిర్యాదు చేయాలని కోరారు. అంతకుముందు మంత్రి డా॥ పెద్దిరెడ్డి మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ నివాసంలో మధ్యాహ్న భోజనం చేశారు. సమావేశంలో డిప్యూటీ సిఎం నారాయణస్వామి, టిటిడి బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు,పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యం, రెస్కోఛైర్మన్ సెంధిల్‌కుమార్, ఎఎంసి ఛైర్మన్ విద్యాసాగర్, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు మునస్వామి, హాఫీజ్, సీనియర్ నేతలు ఎంఆర్‌సి రెడ్డి, నరేష్‌కుమార్‌రెడ్డి, రెడ్డెప్ప, ఎపిఐడిసి డైరెక్టర్ నందకుమార్, ఎపిసిఎస్‌సి డైరెక్టర్ శ్రీనివాసమూర్తి, రాష్ట్ర వన్నియకులక్షత్రియ కార్పోరేషన్ ఛైర్మన్ వనిత శ్రీను, ఎంపిపి అశ్విని, జడ్పీటిసి ఎడిఎస్ శరవణ, కౌన్సిలర్లు, వైఎస్సార్సీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే భూమనకు మరో పదవి!

**సభా హక్కుల కమిటీ ఛైర్మన్‌గా నియామకం**
**-నిత్యం ప్రజలతో మమేకమే ఆయనకు కలిసొచ్చిన అవకాశం**



తిరుపతిరూరల్, జూలై17 ప్రభాతవార్త:

తిరుపతి వంటి పుణ్యక్షేత్రంలో ...ప్రజానాయకుడుగా నిత్యం ప్రజలతో మమేకమై,,,వారిలో ఒకడిగా మెలగి , సమస్యల పరిష్కారంలో ప్రత్యేక చొరవచూపుతున్న తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డికి ప్రభుత్వం తగిన గుర్తింపుతో మరో బాధ్యతాయుతమైన పదవిని కట్టబెట్టింది. ఎన్నికల సంవత్సరంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీని తనవంతుగా తిరుపతిలో నడిపించే ఒక సమర్థవంతమైన నాయకుడుగా కొనసాగుతున్న భూమనకు అసెంబ్లీ ప్రివిలెజ్ కమిటీ ఛైర్మెన్ పదవిని అప్పగించారు. ఇప్పటికే తిరుపతి నియోజకవర్గంలో అభివృద్ధికి బాటలు వేసి ఆ దిశగా ప్రజలు మెచ్చేలా పాలన సాగిస్తున్నారు. ఇటీవల గడపగడప కార్యక్రమంలోనూ తనదైన రీతిలో ఉదయమే ఇంటింటికి వెళ్ళి కుటుంబంలోని వారిని ఆప్యాయంగా పలకరిస్తూ వారికి చిన్న సమస్య ఉన్నా వెంటనే పరిష్కరించడంలో ప్రత్యేకతను చాటుకున్నారు. తిరుపతిలో వైసిపికి బలమైన కేడర్ ఏర్పాటుచేశారు. తనను నమ్ముకున్న వారికి చేదోడువాడోడుగా నిలిచి నేనున్నానంటూ భరోసా కల్పిస్తున్నారు. ఇప్పుడు అదే ఆయనకు మరో అరుదైన అవకాశానికి మార్గం సుగమమైంది. తిరుపతి నుంచి శాసనసభ హక్కుల కమిటీ ఛైర్మన్‌గా నియమితులుకావడం భూమనకు ఒక బ్రాండ్‌గా పేర్కుంటున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబానికి దగ్గరగా ఉంటూ ఆయన అనుచరుడుగా తనదైన ముద్ర వేసుకున్నారు. ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాటే వేదంగా పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్ళారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతగా వున్న భూమన కరుణాకర్‌రెడ్డి పదవిని ఆశించి ప్రజలకు చేరువకాలేదు. ప్రజల్లో ఒకడిగా మిగిలిపోయి వారి సమస్యల్లో నేనున్నాంటూ నమ్మకం కలిగించారు. ప్రస్తుతం తిరుపతి ఎమ్మెల్యేగా, టిటిడి పాలకమండలిలో సభ్యుడుగా తనజీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేశారు. వైకాపా ఏర్పాటు తొలినుండి పార్టీ బలోపేతానికి కృషి చేసిన భూమనకు పార్టీలో కీలక బాధ్యతలు అప్పగిస్తారనే నమ్మకం అప్పట్లోనే ఆయన అభిమానుల్లో చర్చజరిగింది. అయితే ప్రస్తుతం అసెంబ్లీ ప్రివిలెజ్ కమిటీ ఛైర్మెన్‌గా నియామకంపై పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అనుచరుడుగా ఆయనకు నమ్మిన కుటుంబసభ్యుడుగా గతంలో తుడా ఛైర్మెన్‌గా, టిటిడి ఛైర్మెన్‌గా భూమన కరుణాకర్‌రెడ్డి అంకితభావంతో విస్తృ సేవలందించారు. టిటిడి ఛైర్మెన్‌గా పాలనలో ప్రత్యేక సంస్కరణలు తీసుకువచ్చి అరుదైన ముద్ర వేసుకున్నారు. తాజా పదవితో 174మంది ఎమ్మెల్యేల పని తీరు, వారి పాలనపై,వారి హక్కుల పరిరక్షణపై దృష్టి సారించే అవకాశం లభించింది

# 26న పిఎస్ఎల్‌వి సి-56 ప్రయోగం

శ్రీహరికోట (తడ), జూలై 17 ప్రభాతవార్త



చంద్రయాన్-3 ప్రయోగ విజయం తర్వాత ఇస్రో శాస్త్రవేత్తలు ఉత్సాహంగా మరో రాకెట్ ప్రయోగానికి సిద్ధమవుతున్నారు. శ్రీహరికోటలోని సతీష్‌థవన్ అంతరిక్ష కేంద్రం మొదటి ప్రయోగ వేదిక ద్వారా ఈ నెల 26న పిఎస్ఎల్‌వి సి-56 ప్రయోగం జరపనున్నారు. కోర్ అలాన్ తరహాలో స్ట్రాపాన్ బూస్టర్లు లేకుండా ఈ రాకెట్‌ను నిర్మించారు. తక్కువ బరువు గల ఉపగ్రహాలను అంతరిక్షంలోకి మోసుకెళ్లే రాకెట్లు స్ట్రాపాన్లు లేకపోయినా కక్ష్యకు చేరుకుంటాయి కాబట్టి ఇప్పుడు కూడా ఈ తరహా రాకెట్‌నే రూపొందించారు. ఇది పక్కా కమర్షియల్ రాకెట్ ఇందులో మొత్తం ఏడు పేలోడ్‌లను ప్రయోగిస్తున్నారు. అందులో సింగపూర్‌కు చెందిన 351.9 కిలోల బరువు ఉన్న భూ పరిశీలన ఉపగ్రహం డిఎస్-ఎస్ఎఆర్ ప్రధానమైనది. దీనితో పాటు 23.58 కిలోల బరువు ఉన్న ఆర్కేడ్, 23 కిలోల బరువు ఉన్న వెలాక్-ఎఎం, 12.8 కిలోల బరువు ఉన్న ఆర్బ్12, స్ట్రైడర్ ఉపగ్రహాలు ఉన్నాయి. మిగతా మూడు నానో శాటిలైట్లు. వీటి బరువు అన్నీ కలిపి 10 కిలోలు మాత్రమే ఉన్నాయి. అందులో గెలాసియా-2 పేలోడ్ బరువు కేవలం 3.84 కిలోలు కాగా, స్కూప్-2 బరువు 4.1 కిలోలుగా ఉంది. ఇక ఈ ప్రయోగంలోనే అతి తక్కువ బరువైన పేలోడ్ నులియన్ 3.05 కిలోలు మాత్రమే ఉంది. ఈ ప్రయోగంలో రాకెట్ లోఎర్త్ ఆర్బిట్‌లో ఉపగ్రహాలను విడిచిపెట్టనుంది. శ్రీహరికోటలో ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి.

## మృత్యుంజయునికి ప్రత్యేకాభిషేకాలు: అలంకారాలు



మృత్యుంజయస్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి,జూలై 18 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయస్వామికి సోమవారం ప్రత్యేకాభిషేకాలు, అలంకారాలు నిర్వహించారు. ఆలయంలో వారంలో ప్రతి రోజూ ఏదో ఉత్సవం నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో సోమవారం అమావాస్య రావటంతో మృత్యుంజయునికి ఉదయం నుంచి వైభవంగా పూజలు నిర్వహించారు. ఇక్కడి మృత్యుంజయ స్వామి ఆలయంలో వర్షాభావంతో ఈ ప్రాంతాలు తల్లడిల్లుతున్నపుడు ఇక్కడ స్వామికి పూజలు నిర్వహించే వారు.ఎవరైనా ప్రాణాపాయ స్థితిలో ఉన్నపుడు నివృత్తి కోసం పూజలు నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో సోమవారం శివయ్యకు ప్రీతిపాత్రమైన రోజు కాబట్టి షోడషాభిషేకాలు నిర్వహించారు. స్వామికి పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అబిషేకాలు నిర్వహించారు.

## మహిళల అభ్యున్నతికి ఆహా క్యాంటీన్లు, జగనన్న మహిళా మార్టులు

**మంత్రి రోజా**



బ్యాంకు లింకేజీతో వడ్డీ లేని రుణాల చెక్కును అందిస్తున్న మంత్రి రోజా

నగరి, జూలై 17 ప్రభాతవార్త:

మహిళల అభ్యున్నతికి ఆహా క్యాంటీన్లు, జగనన్న మహిళా మార్టులు, డ్వాక్రా ఉత్పత్తుల యువజన సర్వీసులు ఏర్పాటు చేసినట్లు మంత్రి రోజా అన్నారు. నగరి మున్సిపాలిటీపరిధిలోని మెప్మా కార్యాలయంలో అర్బన్ మార్కెట్, ఆహా క్యాంటీన్ ప్రారంభోత్సవం, ఫుడ్ ఫెస్టివల్, బ్యాంక్ లింకేజీతో వడ్డీ లేని రుణాలు 13.27 కోట్లు మెగా చెక్కు పంపిణీ కార్యక్రమంలో సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో మహిళల స్వయం ఉపాధి కల్పించేందుకు మహిళల ఆదాయాన్ని పెంచేందుకు ఎన్నో వినూత్నమైన ఆలోచనలను ఆవిష్కరిస్తున్నామని, అందులో ఈ ఆహా క్యాంటీన్లు, జగనన్న మహిళా మార్టులు, డ్వాక్రా ఉత్పత్తుల అమ్మకాల కేంద్రాలు చాలా కీలకమైనవని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో ఉన్న డ్వాక్రా మహిళలకు వారిలో ఉన్న నైపుణ్యాన్ని సామర్థ్యాన్ని గుర్తించి వారికి ప్రభుత్వమే సహకారాన్ని అందించి వారి ఆదాయాన్ని పెంచే ప్రయత్నం చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ రోజు రాష్ట్రంలో తక్కువ ధరకు రుచి, శుచితో కూడిన ఆహారాన్ని విక్రయించేలా ఈ ఆహా క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లోను సుమారు 140 ఆహా క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నందుకు మెప్మాకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఆహా క్యాంటీన్లకు ప్రభుత్వం 13 వేల ఆర్థిక సహాయం చేయడం, వారికి రుణాలు సున్నా వడ్డీకే ఇప్పించి వాళ్ళ వ్యాపార అభివృద్ధికి సహకరిస్తోందని తెలిపారు. మహిళా మార్టులను కూడా రియల్స్, హెరిటేజ్, బిగ్ బజారు వంటి కార్పొరేట్ సూపర్ మార్కెట్‌లకు ధీటుగా జగనన్న మహిళా మార్టులను ఏర్పాటు చేస్తున్నారని, వీటి వలన వ్యాపారభివృద్ధి చెంది మహిళల ఆదాయం మరింత రెట్టింపు అవుతుందని వివరించారు. డ్వాక్రా మహిళల ఉపాధి కోసం కార్పొరేట్ రిటైల్ సంస్థలతో టై అప్ అవ్వడం, అమూల్‌తో ఒప్పందం చేసుకోవడం, వారికి చిన్నచిన్న వ్యాపారాలు చేసుకోవడానికి సహకారం అందించడం ఈ దేశంలో ఏ ప్రభుత్వం అందించినంత చేయూతని జగనన్న ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. అలాగే జగనన్న 44 లక్షల మందికి అమ్మఒడి అమలు చేశారని, 80 లక్షల మందికి డ్వాక్రా మహిళలకు ఆసరా ఇస్తున్నాడని, 45 ఏళ్ళ నుంచి 60 ఏళ్ళ మధ్య మహిళలకు 26 లక్షల మందికి చేయూతను ఇచ్చాడని, ఆడ పిల్లల చదువు కోసం విద్యా దీవెన ఇస్తున్నాడని, సున్నా వడ్డీ పథకాన్ని అమలు చేస్తున్నాడని, 31 లక్షల మంది మహిళలకు ఇళ్ళ పట్టాలిచ్చాడని వివరించారు. అనంతరం బ్యాంకు లింకేజీతో వడ్డీ లేని రుణాలు 13.27 కోట్లు మెగా చెక్కు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు, రాష్ట్ర డైరెక్టర్లు, కమిటీ ఛైర్మన్‌లు, జిల్లా మెప్మా అధికారి రాధమ్మ, మున్సిపల్ కమిషనర్, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

## భారతీయ సంస్కృతికి నిలువుటద్దం నాట్య ఉత్సవాలు

తిరుపతి క్రీడ, జులై 17, ప్రభాతవార్త



పురాతన కాలం నుంచి భారతీయ సంస్కృతి కలలకు పుట్టినిల్లుగా వెలుగందుతున్న తరుణంలో పాశ్చాత్య ఆచారాల ప్రభావం వల్ల ఎంతో విలువైన మన సంస్కృతి మరుగునపడి, అంతరించిపోయే ప్రమాదం ఉందని సంస్థ అధ్యక్షులు పల్లంశెట్టి సురేష్ అన్నారు. గత రెండు రోజులుగా నృత్యోత్సవాలు శ్రీ సాయి నాట్యాంజలి ఫైనాన్స్ డెవలప్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యంగా దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి 250 మంది కళాకారులు కూచిపూడి, భరతనాట్యం, ఆంధ్ర నాట్యం, పేరిణి, ఒడిసి, జానపద మొదలగు రంగాలలో ప్రదర్శనలు జరిగాయి. నాట్య గురువులు పది మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమలలోని ఆస్థాన మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులు కుంచే లక్ష్మీపతి కల్చరల్ సౌత్ జోన్ ప్రోగ్రాం నెంబర్, గురువులు అశ్విని హరిదాస్, భరతనాట్యం, రాధిక కూచిపూడి, ఐస్మాన్ గుప్త, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎస్ ఉద్యోగుల అసోసియేషన్

నూతన కార్యవర్గం

-ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

తిరుపతి,జులై 17ప్రభాతవార్త:



సిపిఎస్ ఉద్యోగుల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. గౌరవ అధ్యక్షుడు పాలెల రామాంజనేయులు ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీర్లకిరణ్, ఉమ్మడి చిత్తూరుజిల్లా అధ్యక్షుడు పచర్ల సుధాకర్ ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత నిచ్చి పనిచేస్తామని నూతన కార్యవర్గం తెలిపింది. సిపిఎస్ నూతన జిల్లా కార్యవర్గంలో గౌరవ అధ్యక్షుడుగా చీర్లకిరణ్, జిల్లా అధ్యక్షుడుగా వంకీపురం పవన్, అసోసియేట్ అధ్యక్షుడుగా ఎ.మణికంఠ, ప్రధాన కార్యదర్శిగా పివి సుబ్బారెడ్డి, జిల్లా మహిళ అధ్యక్షురాలూగా జి.రేఖ, అదనపు ప్రధాన కార్యదర్శిగా బి.ధరణీకుమార్, ఆర్థిక కార్యదర్శిగా ఎన్.హేమంత్, రాష్ట్ర కౌన్సిలర్‌లుగా చీర్లకిరణ్, గంట భరత్, జి.దేవానంద్, టి.శ్రీనాథ్, ఉపాధ్యక్షులుగా సి.సునీల్‌కుమార్, బి.శ్రీహరి, కొప్పెర్ల శివ, టి.యుగం ధర్‌రెడ్డి, పూల హరికృష్ణ, జల్లా శివప్రసాద్, సురేష్, ఎండి సలీమ్, జి.పవన్‌కుమార్‌రాజు ,ప్రేమ్‌కుమార్, మహిళ ప్రదాన కార్యదర్శిగా మంజుల, సంయుక్త కార్యదర్శులుగా టిసి రఘువర్మ, జి,విజయలక్ష్మి, జి.నాగరాజు, ఎం.వెంకటేశు, కె.ప్రభాకర్, ముత్తివేలు, విజయకుమార్, టి.జయప్రకాష్ ఉన్నారు.

## సిఐ అంజు యాదవ్‌పై చర్యలు తీసుకోవాలి

జిల్లా ఎస్పికి బిజేపి నాయకులు వినతి

తిరుపతి క్రైం, జులై 17, ప్రభాతవార్త



శ్రీ కాళహస్తిలో జనసేన నాయకుడిపై చేయి చేసుకున్న సిఐ అంజు యాదవ్ పై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డికి బిజేపి నాయకులు వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా బిజేపి నాయకులు మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న అంజు యాదవ్ దురుసుగా ప్రవర్తనంలో ప్రజల్లో పోలీస్ డిపార్ట్మెంట్ యొక్క పరువు తీస్తున్నారు. ఇటీవల శ్రీ కాళహస్తిలో జనసేన నాయకుడిపై చేయి చేసుకోవటం, పబ్లిక్‌గా తొడలు కొడుతున్న సంఘటనలు సోషల్ మీడియాలో హల్చల్ చేస్తున్నాయి. అందువల్ల అంజు యాదవ్ ప్రవర్తన పై శాఖ దర్యాప్తు చేయించి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాటకొండ విశ్వనాథ్, డిజే వైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దాము రాయల్ బిజేపి తిరుపతి మండల అధ్యక్షులు శరత్ కుమార్‌ని కలిసి వినతి పత్రం సమర్పించారు.

## నందకుమార్ ఇంటిని సందర్శించిన మంత్రి

కుప్పంరూరల్,జూలై 17 ప్రభాతవార్త



రాష్ట్ర అటవీ,గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎసిఐడిసి డైరెక్టర్ నందకుమార్ ఇంటిని సందర్శించారు. ఈసందర్భంగా వారి ఇంట్లో మంత్రి అల్పాహారం సీ వ్కరించారు. కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, యువనేత అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## నారా లోకేష్‌ను కలసిన దళితనేత కన్నన్

కుప్పంరూరల్, జూలై 17 ప్రభాతవార్త



తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కుప్పం నియోజకవర్గ దళిత నేత కె.కన్నన్ మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం ప్రకాశం జిల్లా కందుకూరులో జరుగుతున్న యువగళం పాదయాత్ర లో కలసిరాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడుల గురించి వివరించారు. ఈసందర్భంగా లోకేష్ మాట్లాడుతూ తెదేపా అధికారంలో రావడం ఖాయమని దళితులకు అన్ని విధాలా అండగా ఉంటామని లోకేష్ పేర్కొన్నట్లు ఆయన తెలిపారు.

## డిగ్రీ ఫలితాల్లో కెడిసి ప్రతిభ

కుప్పం, జూలై 17 ప్రభాతవార్త



ఎస్వీయు ప్రకటించిన డిగ్రీ మూడో సంవ త్సరం ఐదో సెమిస్టర్ ఫలితాల్లో కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిం చినట్లు ఛైర్ పర్సన్ శాంత నాగరాజ్ తెలి పారు.బిఎస్సీ (బిజెడ్‌సి) లో జ్యోతిక 9.50, భారతి 9.30, ఎంపిసిఎస్‌లో నేత్రావతి 9.43,శ్వేతశ్రీ 9.28, ఎంఎస్‌సిఎస్‌లో శరణ్య9.00, సతీష్‌కుమార్ 8.54శాతం మార్కులు సాధించారన్నారు. బికాం సిఎలో యామిని, ద్రాక్షాయణి,నిఖిత, ఆనంది, చాందిని,నవీన్‌కుమార్,తదితరులు కళాశాల టాపర్లుగా నిలిచారన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను వైస్ ఛైర్మన్ సాగర్‌రాజ్,ప్రిన్సి పాల్ సుధారాణి అభినందించారు.

## ప్రముఖ న్యాయవాది బిజేపి నాయకులు రాజశేఖర్‌కి ఘన సన్మానం

తిరుపతి కలెక్టరేట్, జులై 17, ప్రభాతవార్త



అంతర్జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా ప్రముఖ న్యాయవాది బిజేపి నాయకులు రాజశేఖర్‌ని బిజేపి జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ గుండాల గోపినాథ్ రెడ్డి, బిజేపి నాయకులు శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజశేఖర్ పార్టీకి ప్రజలకు న్యాయపరమైన సలహాలు, సూచనలు ఇచ్చి అందరి మన్ననలు పొందారు. ఈ కార్యక్రమంలో ధార్మిక సెల్ జిల్లా కన్వీనర్ అక్కిపల్లి మునికృష్ణ యాదవ్ బిజేపి సీనియర్ నాయకులు సుబ్రహ్మణ్యం యాదవ్ బిజేపి తూర్పు మండల ఉపాధ్యక్షుడు తొండమనాటి సుబ్రమణ్యం రెడ్డి పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## సీఐచే పూతలపట్టు పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ

పూతలపట్టు, జూలై 17 ప్రభాతవార్త:



పూతలపట్టు పోలీస్‌స్టేషన్‌ను కల్లూరు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవలే అనంతపురం జిల్లా నుండి కల్లూరు సీఐగా బదిలీపై వచ్చిన శ్రీనివాసులు సర్కిల్ పరిధిలోని పూతలపట్టు పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో వున్న కేసులు వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈకార్య క్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

పెద్దపంజాణి, జూలై 17 ప్రభాతవార్త



అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పలమనేరు రూరల్ సిఐ అశోక్‌కుమార్ తెలిపారు. మాది శివాడి గ్రామంకు చెందిన గుండ్లపల్లి వినయ్ (27) అనే వ్యక్తి సోమవారం రెండు కిలోల గంజాయితో శివాడి చెరువు కట్టమీద నడుచుకుని వెళ్తుండగా పోలీసులు అతన్ని అదుపులో తీసుకున్నట్లు తెలిపారు. నిందితుడ్ని తహశీల్దార్ లోకేశ్వరరావు సమక్షంలో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాసులు పాల్గొన్నారు.

## డిగ్రీ ఐదో సెమిస్టర్ ఫలితాల్లో ఐఆర్‌ఎం విద్యార్థుల ప్రతిభ

కుప్పం, జూలై 17 ప్రభాతవార్త



తిరుపతి ఎస్వీయు విడుదల చేసిన డిగ్రీ ఐదవ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో ఐఆర్‌ఎం డిగ్రీ కాలేజ్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల ఛైర్మన్ బిఎం దయానిధి తెలిపారు. బిఎస్సీ(ఎంపిసిఎస్)లో జాహ్నవి9.36శాతం పాయింట్లతో పట్టణ టాపరుగా నిలిచిందన్నారు. బిజెడ్‌సిలో దేవకి 8.79మార్కులతో కళాశాల టాపర్‌గా నిలిచిందన్నారు. అలాగే వివిధ గ్రూపుల్లో జ్యోతిక, తులసి, సోనియా, ఇందుప్రియ, సంధ్య, లక్ష్మి, సాయిదీప్తి, అమీనా హర్‌మైన్, నందినిలు ఉత్తమ మార్కులు సాధించారన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను ఛైర్మన్ అభినందించారు.

## ఉద్యోగ భద్రతకై మంత్రికి గెస్ట్ ఫ్యాకల్టీల వినతి

కుప్పంరూరల్, జూలై 17 ప్రభాతవార్త



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులు తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ సోమవారం రాష్ట్ర అటవీ,గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. అతి తక్కువగా పదివేల వేతనంతో తాము పనిచేస్తున్నామని ప్రతినెలా జీతాలు అందేలా చూడడంతో పాటు తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని మంత్రిని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్తామని తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి కుమార్, కోశాధికారి రజనీకాంత్, హరీష్, మోహన, రోజా, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ జన్మదిన వేడుకలు

బాలాయపల్లి, జులై 17 ప్రభాతవార్త:



టీడీపీ పార్టీ కార్యాలయంలో వెంకటగిరి మాజీ ఎమ్మె ల్యే కురుగొండ్ల రామకృష్ణ జన్మదిన వేడుకలను మాజీ మండల అధ్యక్షుడు రావి మస్తాన్‌నాయుడు, టీడీపీ నేతలు జడపల్లి కోటేశ్వం గౌడ్, రావి సత్యంనాయుడు, కూని శ్రీహరి, కె.రామచంద్రనాయుడులు భారీ కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలన్నారు. ఉన్నత పదవులు అధిరోహించాలని మాజీ మండల పార్టీ అధ్యక్షుడు రావి మస్తాన్‌నాయుడు తెలిపారు. ప్రతి పేదవాడి ఆకలి తీర్చేందుకు కురుగొండ్ల తాను పదవిలో లేకున్నా ఇప్పటికీ అన్న క్యాంటీన్ ద్వారా రూ.5 లకే భోజనం అందిస్తున్నారన్నారు. నియోజకవర్గ గౌడ సంఘం అధ్యక్షులు జడపల్లి కోటేశ్వరగౌడ్ కురుగొండ్ల జన్మదినం సందర్భంగా అన్న క్యాంటీన్‌ను రాపూరులో ప్రారంభిస్తున్నారని. టీడీపీ సీనియర్ నేత కె.రామచంద్ర నాయుడు చెప్పారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు వెంకటగిరి నియోజకవర్గాన్ని శక్తివంచన లేకుండా కురుగొండ్ల అభివృద్ధికి కృషి చేశారని అధికార ప్రతినిధి కూని శ్రీహరి తెలిపారు.

## ప్రజా సేవకే జీవితం అంకితం

- మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, జులై 17, ప్రభాతవార్త:



ప్రజాసేవకే తన జీవితం అంకితం చేస్తానని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ జన్మదిన వేడుకలు పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య ఘనంగా జరుపుకున్నారు.ప్రజా సేవ చేసేందుకే తాను రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. 10 సంవత్సరాల పాటు ఎమ్మెల్యేగా ఎంతో సేవ చేశానని చెప్పారు. ప్రజలకు ఎప్పుడు అండగా ఉంటానన్నారు. వెంకటగిరిలోని ఆయన నివాస గృహంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ కేక్ కట్ చేసి గజమాలతో సత్కరించారు. నియోజకవర్గం నుండి భారీ సంఖ్యలో పార్టీ నాయకులు తరలివచ్చి కురుగొండ్ల రామకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మాజీ సొసైటీ అధ్యక్షులు దాసరి ప్రభాకర్‌నాయుడు, మాజీ సర్పంచ్ రాజగోపాల్‌నాయుడు 61 కేజీల కేక్‌ను ఏర్పాటు చేసి మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ చేత కట్ చేయించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ బీరం రాజేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ రామచంద్ర నాయుడు, పార్టీ నాయకులు పప్పు చంద్రమౌళిరెడ్డి, పి.విశ్వనాథం, సుధాకర్, చంగారావు, మల్లారం బాబు, కార్యకర్తలకు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## కార్మికుడి అనుమానాస్పద మృతిపై విచారణ చేపట్టాలి

- సిఐటియు మేనకూరు క్లస్టర్ కన్వీనర్ చాపల వెంకటేశ్వర్లు

నాయుడుపేట, జూలై 17 ప్రభాతవార్త



గ్రీన్‌టెక్ పరిశ్రమలో పనిచేస్తున్న కిన్నెర నాగేంద్ర అనుమానాస్పద మృతిపై గ్రీవెన్‌టెక్ యాజమాన్యంపై సమగ్ర విచారణ చేపట్టాలని సీఐటీయూ మేనకూరు క్లస్టర్ కన్వీనర్ చాపల వెంకటేశ్వర్లు తెలిపారు. గతంలో ఈ పరిశ్రమలో అనేకమంది కార్మికులు గాయపడి తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్న సంఘటనలు ఎన్నో వెలుగులోకి వచ్చాయని, అయినా కంపెనీ యాజమాన్యంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని ఆయన తెలిపారు. కంపెనీలోని సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించి కార్మికుడి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన తెలిపారు. మేనకూరు సెజ్‌లోని అనేక పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల జీవితాలు గాల్లో దీపాల్లాగా ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల్లో వరుస ప్రమాదాలపై సమగ్రమైన భద్రత వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆయన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గ్రీవెన్‌టెక్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకొని, మృతుడి కుటుంబానికి 20 లక్షల రూపాయలు నష్టపరిహారం ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

## దొరవారిసత్రంలో టిడిపి భవిష్యత్తు గ్యారెంటీ చైతన్య రథయాత్ర

దొరవారిసత్రం, జూలై 17 ప్రభాతవార్త



దొరవారిసత్రం మండలంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం భవిష్యత్తు గ్యారెంటీ చైతన్య రథయాత్ర ప్రారంభించారు. ముందుగా మేలుపాక గ్రామ సమీపంలో తిరుపతి జిల్లా తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ నరసింహయాదవ్ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డితో పాటు టీడీపీ నాయకులతో కలిసి రథయాత్ర ప్రారంభించారు. తనయాలి పంచాయతీలోని కమ్మకండ్రిగ, వేటగిరిపాలెం గ్రామాల్లో రథయాత్ర చేస్తూ వైసీపీ ప్రభుత్వం అరాచకాలపై నినాదాలు చేశారు. గతంలో ఎన్నడూ ఇసుకను అమ్ముకునే పరిస్థితి లేదని, ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వం ఇసుకను గుట్టలుగా పోసి అమ్మేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే ఆ ప్రభుత్వానికి, ఆ నాయకులకు ప్రజలు బుద్ధిచెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీమంత్రి పనబాక లక్ష్మి, మాజీమంత్రి పరసా రత్నం, నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం, మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం జగన్ పర్యటనను విజయవంతం చేద్దాం

- గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు

గూడూరు, జూలై 17 ప్రభాతవార్త



వెంకటగిరిలో ఈ నెల 21న జరిగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద రావు పిలుపునిచ్చారు. వెంకటగిరిలో జరిగే నేతన్న నేస్తం కార్యక్రమానికి వస్తున్న సీఎం జగన్ సభను విజయవంతం చేసేందుకు నియోజకవర్గ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు, వైసీపీ అభిమానులు పెద్దఎత్తున తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం గూడూరు పట్టణంలోని సొసైటీలో ఎమ్మెల్యే నివాసంలో ఎంఎల్‌సీ కల్యాణ్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ, అధికారులు, ముఖ్య నాయకులతో కలిసి విలేఖరులతో మాట్లాడారు. 22 పథకాల ద్వారా రెండు లక్షల 40 వేల కోట్ల రూపాయలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు అందజేశారని, అలాంటి ముఖ్యమంత్రిని మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఎంఎల్‌సీ బల్లి కల్యాణ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతన్న నేస్తం ఐదో విడత పంపిణీ కార్యక్రమానికి ఈ నెల 21న వెంకటగిరికి వస్తున్న సందర్భంగా ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని వైసీపీ శ్రేణులు పెద్దసంఖ్యలో గూడూరు నియోజకవర్గం నుంచి తరలి రావాలని కోరారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు సంబంధించి ఒక క్యాలెండర్ రూపొందించి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్న సీఎం జగన్ వెంకటగిరి పర్యటన విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు బత్తిన విజయకుమార్, కోడూరు మీరారెడ్డి, కుమారస్వామిరెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, యారం మంజుల, యమునమ్మ, కొట్టు గోవర్ధన్, మైనారిటీ నాయకులు అజీజ్‌ఖాన్, సుభాన్, సందాని తదితరులు పాల్గొన్నారు.

## పరిచయం లేని కొత్త వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- గూడూరు 2వ పట్టణ సిఐ వెంకటేశ్వరరావు

గూడూరు, జూలై 17 ప్రభాతవార్త



గూడూరు ప్రజలు తమ ఇళ్ల వద్ద సంచరించే కొత్త వ్యక్తులతో అప్రమత్తంగా వ్యవహరించాలని గూడూరు రెండవ పట్టణ సిఐ వెంకటేశ్వరరావు సూచించారు. కొందరు హైటెక్ మోసగాళ్లు ప్రభుత్వ సిబ్బందిగా ప్రజలకు మాయమాటలు చెప్పి ఇళ్లలోకి వచ్చి చోరీలకు, మోసాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. రెండవ పట్టణ పరిధిలోని ప్రజలు అలాంటి మోసగాళ్ల చేతిలో మోసపోకుండా పోలీసు సిబ్బంది, సచివాలయ పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేసి వివిధప్రాంతాల ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. సంక్షేమ పథకాలకు సంబంధించి వలంటీర్లు, గుర్తింపు కలిగిన ప్రభుత్వ ఉద్యోగులతో మాత్రమే ప్రజలు సమాచారం పంచుకోవాలని సూచించారు. కొత్త వ్యక్తులను ఇళ్లలోకి రానివ్వడం, వ్యక్తిగత సమాచారం తెలపడం చేయవద్దని ఆయన సూచించారు. ఏ ప్రాంతంలో అయినా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం అందించాలని సిఐ విజ్ఞప్తి చేశారు.

## స్పందన అర్జీలు సత్వరమే పరిష్కరించండి

- గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్

గూడూరు, జులై 17 ప్రభాతవార్త



స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ అధికారులను ఆదేశిం చారు. సోమవారం గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీఓ కిరణ్‌కుమార్ అర్జీదారుల సమస్యలపై అర్జీలు స్వీకరిం చారు. వెంటనే అధికారులతో సమీక్షిస్తూ అర్జీదారుల సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకు సాగారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రారంభించిన స్పందన కార్యక్రమంలో గూడూరు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలపై ఆర్డీఓ కిరణ్‌కుమార్‌కు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా అర్జీదారుల సమస్యలను ఆయన ఓపిగ్గా ఆలకించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలిచ్చారు. అనంతరం అర్జీదారులతో ఫోన్‌లో, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నేరుగా మండల స్థాయి అధికారులతో మాట్లాడారు. తీసుకోవాల్సిన చర్యలపై సూచనలిచ్చారు. సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో అర్జీదారుల సంఖ్య తగ్గేలా చూడాలని, ఒకే సమస్యపై ప్రజలు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం రాకుండా చూడాలని ఆదేశించారు. భూ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండిగూడూరు నియోజకవర్గంలో ప్రధానంగా భూ సమస్యలపై దృష్టిపెట్టాలని ఆర్డీఓ కిరణ్‌కుమార్ కోరారు. సోమవారం స్పందనలో భాగంగా పలువురు తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. సమస్యలలో అధికంగా భూసంబంధిత సమస్యలు ఉండటంతో పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

## పైపులైన్ ధ్వంసం చేశారు.. చర్యలు తీసుకోండి సారూ

- ఆర్డీఓకు పేద రైతు విజ్ఞప్తి

గూడూరు, జూలై 17 ప్రభాతవార్త

పైపులైన్ ధ్వంసం చేశారు.. చర్యలు తీసుకోండి సారూ అంటూ సోమవారం గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఓ పేద రైతు ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతు చల్లా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తొణుకుమాల రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 119/7లో 3.55 ఎకరాల పొలంలో జాభ, మామిడి అంతర పంటగా నువ్వులు పండిస్తున్నానని, తన పక్కనే రమేష్‌రెడ్డి అనే రైతు చెరువులో గ్రావెల్ తోలే క్రమంలో పైపులైన్ ధ్వంసమైందని తెలిపారు. చెట్లు ఎండిపోతున్నాయని, వెంటనే రమేష్‌రెడ్డిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి స్పందించిన ఆర్డీఓ చిల్లకూరు తహశీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. విచారణ జరిపి న్యాయం చేయాలని సూచించారు.

## వెంకన్నపాలెం సచివాలయం తనిఖీ చేసిన ఎంపీడీఓ

కోట, జూలై 17 ప్రభాతవార్త

కోట మండలం వెంకన్నపాలెం సచివాలయాన్ని ఎంపిడిఓ మారెళ్ల భవాని సోమవారం తనిఖీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందుతున్నాయా లేదా అని సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఎవరికైనా అర్హత ఉండీ పథకాలు అందకపోతే అటువంటి వారు జగనన్న సురక్షలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అనంతరం కోట సచివాలయాన్ని కూడా ఆమె తనిఖీ చేశారు.

## జోరుగా సాగుతున్న సీఎం పర్యటన పనులు

వెంకటగిరి, జులై 17, ప్రభాతవార్త:



ఈ నెల 21వ తేది సీఎం జగన్మోహన్‌రెడ్డి వెంకటగిరికి వస్తున్న సందర్భంగా ముమ్మరంగా పర్యటన ఏర్పాట్లను చేస్తున్నారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సీఎం జగన్మోహన్‌రెడ్డి పర్యటనను భారీ ఎత్తున చేసేందుకు కృషి చేస్తున్నారు. గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ ఏర్పాట్లను పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. సీఎం సభ వేదిక హెలిపాడ్ పనులను ఆర్డీవో పరిశీలించారు. జోరుగా సీఎం పర్యటన ఏర్పాట్లు జరుగుతున్నాయి.

# అభివృద్ధి బ్రాండ్ జగనన్న: కాదని చెప్పగలరా?

## -ఎంఎల్ఏ బియ్యపు మధుసూదనరెడ్డి

శ్రీకాళహస్తి రూరల్, జూలై 17 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జగనన్న సంక్షేమ పథకాలకు జనం నుంచి విశేష స్పందన వస్తుందని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అన్నారు. అభివృద్ధికి బ్రాండ్ జగనన్న. కాదని ఎవరైనా చెప్పగలరా? ఎవరో గుర్తింపు లేని వ్యక్తులు వేదికలెక్కి ఏదేదో కూస్తున్నారని ధ్వజమెత్తారు.జగనన్న అధికారం చేపట్టిన తరువాతనే అభివృద్ధి జరుగుతుందని ఆర్థిక అభివృద్ధి జరుగుతుందన్నారు. సోమవారం ఆయన ఏర్పేడుమండలం పెనగడంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ఇంకేం కోరుకుంటున్నారని ప్రశ్నిస్తున్నారు.శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అర్హత ఉండి ఏ ఒక్కరికి ప్రభుత్వ ఫలాలు అందలేదంటే అధికారులను ఇంటికి పంపుతామని శాసనసభ్యుడు బియ్యపు మధుసూదనరెడ్డి అన్నారు. సోమవారం ఏర్పేడు మండలంలోని పెనగడంలో గ్రామంలో విస్తృతంగాపర్యటించారు.ఏర్పేడు



మండలంలో పాపానాయుడు పేట పరిసర ప్రాంతాల్లో నేడు జరుగుతున్న అభివృద్ధి ఎప్పుడైనా జరిగిందా? అని ప్రశ్నించారు. ఇక్కడ జగనన్న ఇక్కడ పరిశ్రమలను ఏర్పాటు చేయటంతో ప్రత్యేక గుర్తింపు వచ్చిందని వివరించారు. రాష్ట్రంలో జగనన్న రాజ్యంతోనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమౌతుందని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అన్నారు. ఆయన ఏర్పేడు మండలంలోని పెనగడం సచివాలయ పరిధిలోని గ్రామం దళిత,గిరిజన వాడలో విస్తృతంగా పర్యటించారు. వైకాపా మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి సారధ్యంలో జడ్‌పిటిసి తిరుమలయ్య, కూనాటి రమణయ్య,ఏర్పేడు సర్పంచ్ శివయ్య,ఎంపిటిసి జమ్మల శ్రీనివాసులు,వైకాపా నాయకులు ఎంపిడిఓ,మండల సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు భారీ ఎత్తున స్వాగతం ఏర్పాటు చేసారు. ఇంటింటి వద్ద మహిళలు హారతులిస్తూ స్వాగతం పలికారు. ప్రజలు పూల వర్షంతో ముంచెత్తారు. ఎన్నికలు సమీపిస్తున్నాయి మాయ గాళ్ళు వస్తారు. మభ్యపెడతారు.ఎన్నికలు ముగిసిన తరువాత హైదరాబాదుకు బయలుదేరుతారు. ఎప్పుడూ మీకుఅందుబాటులో ఉంటే నాయకుడు కావాలా? చుట్టపుచూపుగా వచ్చే నాయకులు కావాలో తెల్చుకోవాల్సిన ఎన్నికలు త్వరలో రాబోతున్నాయని చైతన్య పరుస్తున్నారు.

## సీతారాం పేటలో ప్రభుత్వస్థలాల ఆక్రమణలు

జాయింట్‌కలెక్టర్‌కు ఫిర్యాదు

ఏర్పేడు(శ్రీకాళహస్తి రూరల్), జూలై 18 ప్రభాతవార్త



ఏర్పేడుమండలం సీతారాం పేటలో ప్రభు త్వ స్థలాలు, సాగునీటి కాలువలు, చెరువులకు రక్షణ లేకుండా పోతుందని సోమ వారం గ్రీవెన్స్‌డే సందర్భంగా సర్పంచ్, వైసిపి నాయ కులు జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలి పారు. ఆక్రమణల తొలగిం చి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని అధికారుల ను కోరారు.ఈ సందర్భంగా సర్పంచ్ వేమూరు నిర్మల నాగరాజ్‌యాదవవ్ కొందరు అధికారులు ఫిర్యాదు చేసారు.పంచాయతీలో తర తరాలుగా ఉన్న చవట గుంట, చింతగుంట, సీతారంపేట చెరువు,కలుజులను పూడ్చి ఇదివరకు కొందరు కట్టడాలు కట్టుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రస్తుతం గ్రామ నత్తంను ఆక్రమించుకుంటున్నారని అధికారులు కొందరు ఆక్రమణ దారులకు సహకరించటం వల్లనే ఇలా జరుగుతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు.మర్రిగుంట చెరువు కింద 300 ఎకరాల సాగు భూములున్నాయని ప్రస్తుతం ఆరు లైన్ల రోడ్ల నిర్మాణం పేరుతో ఇష్టారాజ్యంగా మట్టి తవ్వుతున్నారని పిర్యాదు చేసారు.ఇలాగే జరిగితే ఈ ఏడాది ఒకటూడాసాగు నీరందించకుంటే రైతులకుఆ త్మహత్యలే శరణ్యమని పేర్కొన్నారు. సర్పంచ్ నిర్మలానాగరాజుయాదవ్‌తో పాటు ఉప సర్పంచ్ గురుశంకర్, వైసిపి నాయకులు చేమూరు నాగరాజుయాదవ్,కే.కృష్ణయ్య,వైరంగయ్య, మండల యువజన నాయకులు సంపతి నవీన్‌కుమార్ యాదవ్,ఉన్నారు.

## శ్రీకాళహస్తిలో 'నో రూం':భక్తుల అసహనం

పోలీసులు రంగ ప్రవేశం





శ్రీకాళహస్తి, జూలై 18 ప్రభాతవార్త

అమావాస్య,పౌర్ణమి సందర్భంగా శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో అతిధి గృహాల్లో రాత్రి 11 గంటల వరకు లాడ్జిల ముందు 'నోరూం' బోర్డు కనబడుతుంది. తరువాత రద్దీ ఎక్కువగా ఉంది అంటే వ్యాపారం మొదలెడతారు. ఇదే పరిస్థితి ఆదివారం రాత్రి శ్రీకాళహస్తిలో చోటు చేసుకుంది. రూం కోసం ఓ దళారి చేసిన ప్రయత్నం ఫలించకపోవటంతో మేనేజర్‌తో వివాదం పడటం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. దాంతో పోలీసులు రంగ ప్రవేశం చేసారు.వివరాలు ఇలా ఉన్నాయి. గత కొంత కాలంగా అమావాస్య సందర్భంగా రూంలు బ్లాక్ చేయటం అర్ధరాత్రి దాటిన తరువాత అధిక రేట్లకు అవకాశం కల్పించటం ఆనవాయితిగా మారింది.ఈ నేపథ్యంలో ఇటీవల కాలంలో వచ్చిన భక్తులు సన్నిధివీధిలోని అతిధి గృహాల వద్ద తలదాచుకోవాలని భావిస్తున్నారు.దాంతో ఇక్కడ లాడ్జిల వారు ఇష్టారాజ్యంగా ధరలు ఖరారు చేస్తున్నారు. ఆదివారం రాత్రి ఓ యువకుడు గది కోసం లాడ్జి మేనేజర్‌ను అభ్యర్థించారు. కానీ లాడ్జి మేనేజర్ లేదనటంతో వివాదం మొదలైంది. రచ్చగా మారింది. చిలికి చిలికి గాలివానగా మారి చివరకు పోలీసులు రంగప్రవేశం చేయాల్సి వచ్చింది. రెండుమూడు గంటల పాటు ఇక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది, పోలీసులు సర్దుబాటు చేసారు.

**పట్టించుకోని దేవస్థానం:**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం దేవాదాయశాఖ రూ.12కోట్లు వెచ్చించి 125గదుల సత్రాలను నిర్మించారు. అలాగే టిటిడి మరో 40 గదులు నిర్మించారు. డార్మెంటరీ నిర్మించారు.కానీ అక్కడకు వెళ్ళటానికి ట్రాన్సుపోర్టు లేదు. దేవస్థానం గదులను భక్తులకు చూపిస్తే ఆటోల వారికి వచ్చేది ఏమి లేదు. కాబట్టి ఇక్కడ అన్ని ప్రైవేటు లాడ్జిలు దేవస్థానం పేరుతో కొనసాగుతున్నాయి. దేవస్థానంకు సంబంధించిన ఉచిత బస్సులు ఏ పని లేక పార్కింగ్ చేస్తున్నారు.కానీ భక్తుల కు కేటాయించటం లేదు. దాంతో కోట్లు కుమ్మరించి నిర్మించిన అతిధి గృహాలు ఖాళీగా ఉంటున్నాయి.జ్ఞాన ప్రసూనాంబ అతిధి గృహం కేవలం విఐపిల సేవలకే పరిమితమౌతున్నాయి. దాంతో సామాన్య భక్తులకు బస సదుపాయం అరచేతిలో స్వర్గంగానే మారింది.కానీ ఎందుకో పాలకులు కూడా పట్టించుకోవటం లేదు.ఇప్పటికైనా అధికారులు, పాలకులు సామాన్యభక్తులకు బస సదుపాయాల గురించి దృష్టి సారించాల్సి ఉంది.

## గురు పౌర్ణమికి ఆరాధ్యుడు శ్రీకృష్ణుడు

శ్రీకాళహస్తి రూరల్, జూలై 18 ప్రభాతవార్త



ఆషాఢమాసం గురుపౌర్ణమి కి ఆరాధ్యుడు శ్రీకృష్ణుడు అని,భగవద్గీను బోధించిన శ్రీకృష్ణుడే జగద్గురువు అనిత్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార కర్త వివరించారు. సోమవారం శ్రీకాళహస్తి మండలంలోని జంగాలపల్లి, మద్దిలేడు,కృష్ణగిరి,రాజుల పాళెం గ్రామాల్లో త్రైత సిద్ధాంతం ప్రభోధ సేవా సమితి ఇందూ విజ్ఞాన వేదిక కమిటి ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. గురువు అంటే గుణాతీతుడు అలాగే రు అంటే రుపవర్జితుడని గుణముల మలినం లేదని అలాగే రూపం లేదని వివరించారు. గురువు గుండ్రాయి లాంటి వాడని వివరించారు.కమిటి అధ్యక్షుడు చింత సుబ్రమణ్యం, వెంకటలక్ష్మీ, సుధ, శ్రీనివాసులు, గుణసుందరి, వెంకటరత్నం,అమరావతి, జయసుధ,ఉదయ్ కిరణ్‌యాదవ్,సురేష్‌యాదవ్ తదితరులు హాజరయ్యారు.

## కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

చౌడేపల్లి, జూలై 17 ప్రభాతవార్త

కుటుంబ కలహాలతో వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం చౌడేపల్లిలో చోటు చేసుకొంది. ఎస్ఐ రవికుమార్ కథనం మేరకు...మండలంలోని దిగువపల్లి పంచాయతీ యానాదిపాళెంకు చెందిన పాపయ్య(34)కూలీ పనులు చేసుకొంటూ జీవిస్తున్నాడు. గత వారం రోజులుగా కుటుంబంలో కలహాలు మొదలయ్యాయి. మనస్తాపం చెందిన పాపయ్య గ్రామానికి సమీపంలోని సదాశివం వ్యవసాయ బావిలో ఉరేసుకొని మృతి చెందాడు. మృతుని భార్య గంగులమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

## బంగారు తిరుచ్చిపై "శ్రీసీతారామలక్ష్మణులు"

చంద్రగిరి, జూలై 17 ప్రభాతవార్త:



శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో సోమవారం పునర్వసు నక్షత్రంను పురస్కరించుకుని శ్రీసీతారామలక్ష్మణ హనుమంత సమేతులై బంగారు తిరుచ్చిపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామి వారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల అర్చనాధి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీసీతారామలక్ష్మణ హనుమంతుల వారి ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి బంగారు తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల రామ నామస్మరణల నడుమ స్వామివారు తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపినాద్, సూపరింటెండెంట్ తేనెపల్లి వెంకటస్వామి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, అర్చకులు కె.ఎస్.రాజు, అధ్యాపక రవిచంద్రన్, పరిచారిక ఘనాపాటి తిరువెంగడం, ఓ.ఎస్.డబ్ల్యు మూర్తి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## చేమూరు గ్రామంలో ఫీవర్ సర్వే

తొట్టంబేడు, జూలై 17 ప్రభాతవార్త



మండలంలోని చేమూరు గ్రామంలో మూడు నుంచి ఐదు కుటుంబాలు టైఫాయిడ్ జ్వరాల బారిన పడ్డారని గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న కాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి తన బృందంతో కలసి సందర్శించారు. రోగులకు కావాల్సిన పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీచేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టైఫాయిడ్ జ్వరాల నివారణకు వేడినీటిని ఉపయోగించాలన్నారు. అందరికీ ఆరోగ్యం ఎంతో అవసరమని తగిన జాగ్రత్తలు తీసుకుంటే రోగాలు దరిచేరవన్నారు. ఎవరికైనా జ్వరాలు ఉన్నట్లు తెలిస్తే వెంటనే సమీపంలోని కాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకోవాలన్నారు. కాగా ఇక్కడ వైద్యాధికారిణిగా పనిచేస్తున్న డాక్టర్ అనూష బదిలీపై వెళ్ళడంతో ఆమెస్థానంలో చిత్తూరు అర్బన్ హెల్త్‌సెంటర్‌లో కాంటాక్టు పద్ధతిలో పనిచేస్తున్న డాక్టర్ శివకుమార్‌ను ఇక్కడకు రెగ్యులర్ డాక్టర్‌గా నియమించారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్‌తో పాటు ఎంపిహెచ్ఈఓ బాషా, సూపర్‌వైజర్ అమ్మణమ్మ, ఎఎన్ఎం రోజా, ఆశా నాగరత్న, ఇంజనీరింగ్ అసిస్టెంట్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే ఉజ్వలభవిష్యత్తు

శ్రీకాళహస్తి, జూలై 17 ప్రభాతవార్త



విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని బడి నిలచిపోయిన మరియు బడికి తరచూ గైర్హాజరవుతున్న విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ వహించడానికి గ్రామ పరిధిలోని జింగిలిపాళెం ఎస్టీ కాలనీలో గత రెండు రోజులుగా ఉపాధ్యాయ బృందం సందర్శించారు. కాలనీలోని విద్యార్థులు పాఠశాలకు తరచూ గైర్హాజరవడం వల్ల వారి యొక్క తల్లిదండ్రులను వారి ఇంటికి వెళ్ళి కలవడం జరిగింది. విద్యార్థులకు విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులపై కూడా కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలైన జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, పాఠశాలలో ఇస్తున్న సమవస్త్రాలు, జగనన్న కిట్, పాఠ్యపుస్తకాలు, డిక్షనరీ తదితర విషయాలను వివరించారు. పాఠశాలకు విద్యార్థులు రోజు వచ్చేలా చూడాలని తల్లిదండ్రులను కోరారు. చదువుకునే వయస్సులో పనులకు తీసుకెళ్ళవద్దన్నారు. డ్రాపౌట్స్ విద్యార్థులను హాస్టలల్లో చేర్పించే విధంగా చర్యలుతీసుకుంటున్నామని తెలిపారు. అందుకు విద్యార్థుల తల్లిదండ్రులు సానుకూలంగా స్పందించారు. విద్యార్థులు సక్రమంగా బడికి వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రాజకుమారి, ఉపాధ్యాయులు సురేష్, మురళీ, మల్లికార్జున,శ్రీనివాసులు, రమేష్‌బాబు, శాంతి, రజియా, సుమతి మరియు విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ఓంశక్తి ఆలయం ఆధ్వర్యంలో చక్రాల కుర్చీల పంపిణీ

నగరి, జూలై 17 ప్రభాతవార్త:

నగరి పట్టణంలో వెలసి ఉన్న మేలు మరువత్తూరు ఆది పరాశక్తి ఆధ్వర్యంలో నగరి పట్టణ, పరిసర ప్రాంత దాతల సహకారంతో నగరి మందిర గురుపాదుకుల మహోత్సవ సందర్భంగా నగరి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి చక్రాల కుర్చీలు, పరుపు దిండ్లు, బాలింతలకు బ్రెడ్లు, పండ్లు, బిస్కెట్లు, చెవిటి వారికి వినికిడి పరికరాలు, వికలాంగులకు చేతి కర్రలు ఆలయ నిర్వాహకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రభావతి పర్యవేక్షణలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధాన డాక్టర్ జరీనా, డాక్టర్లు కార్తీకేయన్, అడ్మినిస్ట్రేటర్ ఆఫీసర్ రాజశేఖర్, నర్సింగ్ స్టాఫ్ నర్సు ఆదిలక్ష్మి, ఫార్మా సూపర్‌వైజర్ ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు, ఓంశక్తి భక్తులు పాల్గొన్నారు.

## గంజాయితో పట్టుబడ్డ యువకులు

రిమాండ్‌కు పంపిన సెబ్ అధికారులు

రేణిగుంట, జూలై 17 ప్రభాతవార్త:



రేణిగుంట పట్టణ పాత చెక్‌పోస్టు వద్ద ముగ్గురు యువకులను గంజాయితో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తిరుపతి రూరల్, ఇంటెలిజెన్స్ వింగ్ అధికారులు చాకచక్యంగా వలపన్ని అదుపులోకి తీసుకున్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఏఎస్పీ ఏ.రాజేంద్ర ఆదేశాల మేరకు అధికారులు రేణిగుంట పాత చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహించి ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన యువకులు రేణిగుంటకు చెందిన అఖిల్‌బాషా(చోటు), తిరుపతి సప్తగిరి నగర్‌కుచెందిన శ్రావణ్, మంగళంకు చెందిన లోకనాథరెడ్డిలుగా గుర్తించారు. ఈ గంజాయి ముఠాలో మరో ఐదు మంది ప్రమేయం ఉన్నట్లు పట్టుబడిన వ్యక్తుల ద్వారా తెలుసుకున్నారు. వీరిని సోమవారం రిమాండ్‌కు తరలించి తక్కిన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న సీఐ పరేంద్ర, ఎస్ఐ భాస్కర్, కానిస్టేబుళ్లు రవి, చిరంజీవి, అశోక్ కుమార్, మహేష్‌లను ఉన్నతాధికారులు అభినందించారు.

## అభివృద్ధి పథంలో రామానుజపల్లి

-రూ.8లక్షల వ్యయంతో సి.సి. రోడ్డు నిర్మాణం

తిరుపతిరూరల్, జూలై17 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ మండలం రామానుజపల్లి గ్రామ పంచాయతీ అభివృద్ధి పథంలో పయనిస్తుంది. రామాను జపల్లి గ్రామ సర్పంచ్ పొట్టేలి లీలారాణి రవికుమార్ ఆధ్వర్యంలో పంచాయతీలో అభివృద్ధి పనులు కొనసాగు తున్నాయి. ఎన్నో సంవత్సరాలుగా రామానుజపల్లి ఆవిష్కృతమైన భూగర్భ డ్రైనేజ్ సమస్యను పరిష్కరించి ప్రజల మన్నలు పొందారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తిరుపతిరూరల్ ఎంపిపి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సహకారం తోప్రతి ఇంటికి వాటర్ కనెక్సన్‌తో పాటు భూగర్భ డ్రైనేజ్ కనెక్సన్ ఏర్పాటు చేసారు. అలాగే పంచాయతీ సుందరీకరణలో భాగంలో రూ.8లక్షల రుపాయాల వ్యయంతో సి.సి. రోడ్లు ఏర్పాటు చేస్తున్నారు. రామానుజపల్లిని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్ళటానికి తమవంతు కృషి చేస్తున్నట్లు సర్పంచ్ లీలారాణి తెలిపారు.

## రాముల వారి అర్చనలకు సి.ఎం.కేశవులు మొదటి చందా..!

10 ఏళ్ళ కాలపరిమితితో దాతకు నిత్య అర్చన



చంద్రగిరి, జూలై 17 ప్రభాతవార్త:

శ్రీకోదండరాముల వారి ఆశీస్సుల కొరకు నిత్య అర్చనలు, ప్రత్యేక హారతులకై మాజీ ఎంపిపిటిసి, డాక్యుమెంట్ రైటర్ (బుజ్జి) సి.ఎం.కేశవులు సోమవారం మొదటి చందా రూ.10 వేలు చెల్లించారు. ఈ సందర్భంగా ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు మాట్లాడుతూ రాముల వారి ఆలయంలో భక్తులకు వివిధ ప్రయోజనాలు కల్పిస్తూ టిటిడి నగదు రూపంలో విరాళాలను ఆహ్వానించడం జరిగిందన్నారు. ఈ మేరకు స్పందించిన ఆయన తన ఆరాధ్యదైవమైన శ్రీరామచంద్రుడి పట్ల భక్తిశ్రద్ధలతో పదేళ్ళ కాలపరిమితితో కూడిన కార్యక్రమానికి రూ.10 వేలు చందా చెల్లించినట్లు తెలిపారు. ఇందులో పదేళ్ళ కాలపరిమితిలో దాతకు నిత్య అర్చన, దాత ఎంపిక చేసుకున్న రీతిన ఏడాదికి 30 సార్లు హారతి, అర్చకునిచే ఆశీర్వచనం, అన్నప్రసాదం అందించబడుతుందన్నారు. విరాళం అందజేసే సమయంలో ఆలయ అధికారులు పిఎస్ దుప్పటతో సన్మానించారు. అనంతరం దాత మాట్లాడుతూ చారిత్రాత్మక నేపథ్యం కలిగిన అతి పురాతనమైన శ్రీకోదండరామాలయం టిడిపి అనుబంధ ఆలయంగా భాసిల్లుతున్నప్పటికీ భక్తుల రాక ఆశించిన మేరకు లేక వెలవెలపోతున్నట్లు ఆయన ఆవేదన చెందారు. భక్తుల రాకకై ఆలయంలో నిత్యం హరినామ సంకీర్తలను, హరికథలు, తిరుమల శ్రీవారి చిన్న లడ్డూ ప్రసాదం కౌంటర్ ఏర్పాటు, ఏపి టూరిరిజం ఆలయ దర్శిణి బస్సు, టిటిడి ఉచిత బస్సులను నడపటం వంటి చర్యల ద్వారా ఆలయ అభివృద్ధికి అవకాశం లభించగలదన్నారు. దాతల సలహాలు, సూచనలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు డిప్యూటీ ఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ కె.శ్రీనివాసులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కె.గోపాలకృష్ణ, ప్రధాన అర్చకులు శ్రావన్‌కుమార్, డాక్యుమెంట్ రైటర్ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పుత్తూరురూరల్, జూలై 17 ప్రభాతవార్త:



అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం పుత్తూరు మండల పరిధిలో జరిగింది. సీఐ లక్ష్మీనారాయణ కథనం మేరకు... కొత్తూరు మండలం కేబీఆర్ పురం దళితునికి చెందిన పరశురాం(55) ఇంటిలోని ఫ్రిడ్జ్ తెరవడంతో గ్యాస్ లీక్ కావడంతో పేలిందని దీంతో పరశురాం మృతి చెందాడని బంధువులు ఫిర్యాదు చేశారన్నారు. అయితే అక్కడ జరిగిన సంఘటన బట్టి చూస్తే మృతి చెందినట్లు చేశామని, పోస్టుమార్టం నివేదిక వచ్చాక కేసు దర్యాప్తు చేసి కేసు నమోదు చేయడం జరుగుతుందని సీఐ తెలిపారు.

## క్రైస్తవులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సిఎం

తిరుపతి ప్రెస్‌క్లబ్, జూలై 17 ప్రభాతవార్త:



క్రైస్తవులకు ఇచ్చిన మాట ప్రకారం రెండవ విడతలో దరఖాస్తు చేసుకున్న పాస్టర్లకు సిఎం జగన్‌మోహన్‌రెడ్డి వారికి గౌరవ వేతనం కింద వారి ఖాతాలో 20 వేల రూ॥లు జమ చేయడం అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ బిషప్స్ కౌన్సిల్ చైర్మన్ డా॥యలమంచిలి ప్రవీణ్ అన్నారు.సోమవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే క్రైస్తవులకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నారని,అయితే తాజాగా వారికి గౌరవ వేతనం అందించడం ఆనందంగా ఉందన్నారు.దీనికి కృషి చేసిన రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డా॥డా॥మేరుగ నాగార్జునకు కృతజ్ఞతలు తెలుపుతున్నాని అన్నారు.ఇదే పెద్ద మనసుతో రాష్ట్రంలో అతి పెద్ద సమస్యగా ఉన్న దళితుల స్మశాన సమస్యను పరిష్కరించిన ప్రభుత్వం,దళిత క్రైస్తవుల సమస్యను కూడా పరిష్కరించాలని కోరారు.

## డిగ్రీ ఫలితాల్లో సిఆర్‌రెడ్డి విద్యార్థుల ప్రతిభ

తొట్టంబేడు, జూలై 17 ప్రభాతవార్త



మండలంలోని డాక్టర్ సిఆర్.రెడ్డి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎస్వీయు విశ్వవిద్యాలయం నిర్వహించిన మూడో సంవత్సరం ఐదో సెమిస్టర్ ఫరీక్షా ఫలితాలలో బియస్‌సిలో మల్లిరాజ 8.97/10, మరియు తొండు ప్రభావతి 8.47/10 పాయింట్లుతో ప్రథమస్థానంల నిలిచారన్నారు. వీరిద్దరికి గణితం, మరియు స్టాటిస్టిక్స్ పరీక్షలో 10కి 10 పాయింట్లును సాధించారన్నారు. బి.ఎ కోర్సులో ఈ.శ్వేతశ్రీ 8.29/10, హిమబిందుకు 8.20/10 పాయింట్లు వచ్చాయన్నారు. ఈసందర్భంగా విద్యార్థిని విద్యార్థులను కళాశాల అధ్యాపకులు మరియు కళాశాల ప్రిన్సిపల్ కంభంయశోధ, మరియు కరస్పాండెంట్ డాక్టర్ సి.రాజగోపాల్‌రెడ్డిలు అభినందించారు.

# సహజవనరులను కొల్లగొట్టి వేల కోట్లు దోపిడీ..!

## 2019 నాటికి మీ ఆస్తులు ఎంత .. నేడు ఎంత ..? అమ్మవారి ఎదుట ప్రమాణానికి సిద్ధమా చెవిరెడ్డి..? టిడిపి సీనియర్ లీడర్ మొక్కల కుమార్ రాజారెడ్డి సవాల్

చంద్రగిరి, జూలై 17 ప్రభాతవార్త:

చంద్రగిరి నియోజకవర్గంలోని సహజవనరులను కొల్లగొట్టి వేల కోట్లు దోపిడీకి పాల్పడిన ఘనత ఎంఎల్ఏ భాస్కర్ రెడ్డికే దక్కుతుందని టిడిపి సీనియర్ నాయకుడు మొక్కల కుమార్ రాజారెడ్డి తీవ్ర స్థాయి లో ఆరోపించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలీసుల రక్షణతో ఎంఎల్ఏ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నట్లు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దాదాపు 40 ఏళ్ళుగా తాను రాజకీయాలలో వున్నప్పటికీ తాము ప్రజ లకు సేవ చేయడంలో తమ పలుకుబడిని ఉపయోగించు కున్నామన్నారు. 2019 ఎన్నికల అనంతరం ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నేతృత్వంలో ఆయన అనుచరులు నియోజకవర్గంలో భూదందాలు, మట్టి, ఇసుక మాఫియా సామ్రాజ్యాన్ని సృష్టించి కోట్లు కొల్లగొట్టారని ధ్వజమెత్తారు. భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీమ్ కోర్టు తీర్పు మేరకు ఇసుకను మానవ కార్మిక శక్తితోనే తవ్వి తీసుకోవాల్సి వుందన్నారు. అయితే చెవిరెడ్డి అనుచరులు రెడ్డివారిపల్లి



వద్ద నదిలో యంత్రాలతో పగలు రాత్రి తేడా లేకుండా ఇసుకను దోపి డీ చేస్తున్నట్లు దయ్యబట్టారు. గ్రీన్ ట్రిబ్యునల్, సుప్రీమ్ కోర్టు ఉత్త ర్వులను సైతం భేఖారు చేస్తున్న చెవిరెడ్డి అక్రమ ఇసుక రవాణాకు తిరుపతి జిల్లా పోలీసులు పహారా కాస్తుండటంపై టిడిపి న్యాయ పోరాటం చేయనుందన్నారు. ఇసుక అక్రమ రవాణాపై గ్రామస్థుల ఆందోళనకు సంఘీబావం తెలియజేస్తూ శాంతియుతంగా ప్రశ్నించిన టిడిపి నాయకులు, కార్యకర్తలు 24 మందిపై అన్యాయంగా కేసులు పెట్టడం దారుణమన్నారు. 2019 ఎన్నికల నాటికి మీ ఆస్తులు ఎంత, ప్రస్తుతం మీ ఆస్తులు ఎంత అంటూ ఎంఎల్ఏని నిలదీశారు. మీరు సంపాదించిన సంపాదనపై వారం రోజుల్లో అమ్మవారి ఆలయంలో ప్రమాణానికి సిద్ధం కావాలన్నారు. వారం లోపు మా సవాల్‌ను స్వీకరించాలనీ లేని పక్షంలో తామే అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రమాణం చేయానికి సిద్ధంగా వున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, కొండూరు ప్రవీణ్‌రాయల్, గిరిధర్ రెడ్డి, వీరంగారి రమేష్‌రెడ్డి, సక్కుర్ ధనంజయ రెడ్డి, ఏజి పల్లి బాల, గౌస్‌భాషా, రాజులగారి వినోద్, లంకెళ్ళ లలిత, కాపువీధి సునీల్, వడ్లమూడి దిలీప్ చౌదరి, కొమ్మినేని ప్రభాకర్ నాయుడు, మురళి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం బహిరంగ సభను విజయవంతం చేయండి

**- తిరుపతి జిల్లా వైసీపీ అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి**



కోట, జూలై 17 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా వెంకటగిరిలో జరిగే ఈ నెల 21న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని తిరుపతి జిల్లా వైసీపీ అధ్యక్షుడు నేదురు మల్లి రామ్‌కుమార్‌రెడ్డి కోరారు. సోమవారం కోట మండలం విద్యానగర్‌లోని నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్‌లో నియోజకవర్గ స్థాయి వైసీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటగిరి నుంచి 2023-24 సంవత్సరానికి గాను రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన లబ్ధిదారులకు వరుసగా ఐదోసారి వైఎస్సార్ నేతన్న నేస్తం నగదును బటన్ నొక్కి జమ చేయనున్నారని తెలిపారు. సీఎం పర్యటన, బహిరంగ సభను విజయవంతం చేయాలని రామ్‌కుమార్‌రెడ్డి కోరారు. నియోజకవర్గ స్థాయిలో కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తరలివచ్చి ఈ సభను విజయవంతం చేయాలని కోరారు. ఇప్పటికే గ్రామాల్లో సమాచారం చేరినట్లు తెలిపారు. ఈ సమావేశంలో తిరుపతి ఎంపీ గురుమూర్తి, వైసీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు కొడవలూరు ధనంజయరెడ్డి, ఎంఎల్‌సీ మేరిగ మురళి, వాకాడు సొసైటీ ఛైర్మన్ కొడవలూరు భక్తవత్సలరెడ్డి, రాష్ట్ర వైసీపీ జాయింట్ సెక్రటరీ నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, నేదురుమల్లి హరిశ్చంద్రారెడ్డి, దేవారెడ్డి నాగూర్‌రెడ్డి, షనీల్‌రెడ్డి, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల వైసీపీ కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు.

## సచివాలయ నిర్మాణ పనులను పరిశీలించిన రాష్ట్ర చీఫ్ ఇంజనీర్



వాకాడు, జూలై 17, మండల పరిధిలోని సచివాలయాలు, వెల్నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రాలు నూతన భవన నిర్మాణ పనులను సోమవారం పంచాయితీ రాజ్ రాష్ట్ర చీఫ్ ఇంజనీర్ కృష్ణమోహన్ రెడ్డి పరిశీలించారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం నిర్మాణం పనులు చేపట్టారన్నారు. రాష్ట్రంలోని వాకాడు మండలంలో చేపట్టిన ఆ భవన నిర్మాణాలను కుణ్ణంగా పర్యవేక్షించి సంతోషం వ్యక్తపరిచారు. ఆయన వెంట ఈఈ గురునాథ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవీంద్ర కుమార్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ రవీంద్ర కుమార్, అసిస్టెంట్ ఎగ్జిటివ్ ఇంజనీర్ వేము విజయానంద్ దయాల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రోషన్ కుమార్, వినోద్ ఈవోపిఆర్డి ఉమామహేశ్వర రావు, తదితరులు ఉన్నారు. అనంతరం పంచాయితీ రాజ్ రాష్ట్ర చీఫ్ ఇంజనీర్ కృష్ణ మోహన్ రెడ్డి, సచివాలయాలు, వెల్నెస్ సెంటర్ రైతు భరోసా కేంద్రాలు భవన నిర్మాణ పని తీరును ప్రత్యేంగా అసిస్టెర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయనంద దయాల్‌ను అభినందించారు.

## శివయ్య సేవలో బ్రిటిష్ డెప్యూటీ హైకమీషనర్



శ్రీకాళహస్తి, జూలై 18 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరుని సేవలో దేశ విదేశీయులు తరిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం అమావాస్య సందర్భంగా బ్రిటిష్ డెప్యూటీ హై కమిషనర్ స్వామి అమ్మవార్ల దర్శనానికి వచ్చారు. గ్యారెట్ విన్ ఒవేన్, డెప్యూటీ బ్రిటిష్ హైకమిషనర్, వరుణ్ మల్లి దర్శనానికి వచ్చారు. వారికి ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం వారికి వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. వారికి స్వామి అమ్మవార్ల శేష వస్త్రాలను ప్రసాదంగా ఛైర్మెన్ అందించారు. వారితో పివిఆర్ గ్రూప్స్ డైరెక్టర్లు జనార్ధన్‌రావు జె.పవార్, పరమేశ్వరరావు వి.పవార్, జి.వి.రమణమూర్తి(స్వామి) దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.

**ఏడుకొండల దేవుడికి...**

## ఆరు రకాల సంప్రదాయ పుష్పాలతో పుష్పపల్లకి



తిరుమల, జులై 17 ప్రభాతవార్తప్రతినిధి: ఏడుకొండల వేంకటేశ్వరునికి ఆణివార ఆస్థానం సందర్భంగా సోమవారం సాయంత్రం ఆరు రకాల సాంప్రదాయ పుష్పాలు, ఆరురకాల కట్‌ఫ్లవర్స్ కలిపి పుష్పపల్లకిని సువాసనలతో అందంగా తయారుచేశారు. సాయం సంధ్యవేళ వరుణదేవుడు పలకరించగా ఈ పుష్ప పల్లకిలో శ్రీదేవిభూదేవి సమేత మలయప్పస్వామి వేంచేసి ఆలయ మాడవీధుల్లో విహరించారు. తమిళ నాడు ఈరోడ్డుకు చెందినయ దాత సెంగుట్టవన్ సహకారంతో పుష్పపల్లకి అలంకరణ చేపట్టారు. భక్తుల గోవిందనామస్మరణల మధ్య పుష్పపల్లకి కదిలింది. ఈ వాహనసేవలో టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి, ఛైర్మన్ సతీమణి స్వర్ణలతరెడ్డి, టిటిడి బోర్డుసభ్యులు ,ఆలయ అధికారులు ,అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ఎంపీపీ గంజి జన్మదినం



పుత్తూరు, జూలై 17 ప్రభాతవార్త: పుత్తూరు మాజీ ఎంపీపీ, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు గంజిమాధవయ్య జన్మదినోత్సవం పుత్తూరులో మున్సిపాలిటీ నాయకులు ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు గజమాలతో, శాలువలతో సత్కరించి సన్మానించారు. అనంతరం అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు తినిపించారు. పుత్తూరు రూరల్, మున్సిపాలిటీ నుంచి ఎవరు ఏ సమస్యతో వచ్చినా వెంటనే పరిష్కరించే నాయకుడు గంజిమాధవయ్య అని జన్మదిన వేడుకల్లో పాల్గొన్న టీడీపీ పార్టీ కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఆయన భవిష్యత్‌లో మరెన్నో పదవులను అలంకరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పుత్తూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, రూరల్ పార్టీ అధ్యక్షుడు రవికుమార్, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి ధనపాల్, రూరల్ పార్టీ ప్రధాన కార్యదర్శి బాలాజీ, తడుకు సర్పంచ్ బొబ్బిలి యాదవ్, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## రెండవ రైజింగ్ ఆపరేషన్ విజయవంతం



శ్రీహరికోట (తడ), జూలై 17 ప్రభాతవార్త : గత శుక్రవారం శ్రీహరికోట నుంచి ప్రయోగించిన చంద్రయాన్-3 ఉపగ్రహం భూమి చుట్టూ ప్రదక్షణాలు చేస్తోంది. దీనిని ఎప్పటికప్పుడు భూకేంద్రాల నుంచి శాస్త్రవేత్తలు నియంత్రిస్తున్నారు. ఉపగ్రహంలోని ఇంధనాన్ని మండిస్తూ రైజింగ్ ఆపరేషన్ల ద్వారా అపోజిని పెంచుకుంటూ పోతున్నారు. బెంగళూరులోని ఇస్ట్రాక్ కేంద్రం నుంచి శాస్త్రవేత్తలు ఈ ఆపరేషన్లు జరుపుతున్నారు. ఇప్పటికి రెండు ఆర్బిట్ రైజింగ్ ఆపరేషన్లు విజయవంతం కావడంతో ఉపగ్రహం భూమికి దూరంగా, చంద్రునికి దగ్గరవుతోంది. ఇటువంటివి మరిన్ని పూర్తి చేసి ఇస్రో శాస్త్రవేత్తలు చంద్ర కక్ష్యలోకి దగ్గర చేసే ప్రయత్నంలో ఉన్నారు. ప్రస్తుతానికి భూమికి దగ్గరదూరం 223 కిలోమీటర్లు, భూమికి ఎక్కువ దూరం 42 వేల కిలోమీటర్ల దూరంలో చంద్రయాన్-3 పరిభ్రమిస్తున్నట్లు శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. మరో ఆర్బిట్ రైజింగ్ ఆపరేషన్ మరికొన్ని గంటల్లోనే నిర్వహించే అవకాశం ఉంది.

## ప్రాచ్య పరిశోధనా సంస్థను సందర్శించిన విద్యార్థినులు



తిరుపతి (విద్య), జులై 17 ప్రభాతవార్త : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తెలుగు విభాగం, ఆచార్యులు, ప్రధమ, ద్వితీయ సంవత్సర విద్యార్థినులు శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ప్రాచ్య పరిశోధనా సంస్థను సోమవారం సందర్శించారు. వీరిని ఆహ్వానించి తగిన వివరాలు తెలుసుకునే అవకాశాన్ని డా. వి.సి. వెంకటేశ్వర్లు కల్పించారు. డా. రాజశేఖర్ అక్కడ పని చేసే సిబ్బంది అందరూ ప్రాచ్య పరిశోధన సంస్థ తాళపత్ర గ్రంధల రక్షణ పరిష్కరణలో చేపట్టిన, చేపడుతున్న చర్యలను వివరించారు. తాళపత్ర గ్రంథాలను గరించి మాట్లాడుతూ లిపిలో జరిగిన మార్పులను, తాళపత్రాలను ఏ విధంగా తయారు చేసే వారో అలాగే వాటిపై రాసే పద్ధతులను, వాటిని భద్రపరిచే తీరును చక్రగా వివరించారు. తాళపత్ర గ్రంథాలను మొదటగా సేకరించి భారతదేశ సంపదగా నిలిపిన వారు సిపి బ్రౌన్ అని కొనియాడారు. ఈ పరిశోధన సంస్థ ద్వారా రాళ్లపల్లి అనంత కృష్ణ శర్మ, వేటూరి ప్రభాకర్ శాస్త్రి, తాళపత్ర గ్రంథాలను టిటిడి సహాయంతో సేకరించి, పరిష్కరించి ముద్రించడానికి విశేషమైన కృషిని చేశారని తెలిపారు. ప్రాచీన తాళపత్ర గ్రంథాలను ఎల్లప్పుడూ మిత్రుని వలె పరామర్శిస్తూ ఉండాలన్నారు. పిహెచ్‌డి పరిశోదకులకు ప్రాచ్య పరిశోధనా సంస్థ ఎంతో సహాయకారిగా ఉంటుందన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తెలుగు అధ్యయన శాఖ అధ్యక్షులు ఆచార్య కొలకలూరి మధుజ్యోతి పంపిగా, డా. వై. సుభాషిణి, డా. డి. యువశ్రీ, డా.బి లక్ష్మిప్రియ, విద్యార్థినులు ఈ సందర్శన కార్యక్రమంలో పాల్గొని అనేక విషయాలను తెలుసుకున్నారు.

## తిరుపతి-మదనపల్లె మధ్య 12 విద్యుత్ ఏసి బస్సులు

**-జెండా ఊపి ప్రారంభించిన ఆర్టీసీ చైర్మన్ మల్లిఖార్జునరెడ్డి**



తిరుపతి ప్రెస్‌క్లబ్, జూలై 17 ప్రభాతవార్త: తిరుపతి-మదనపల్లె మధ్య 12 విద్యుత్ ఏసి బస్సులను ఏపిఎస్‌ఆర్టీసీ ఛైర్మన్ అబ్బిరెడ్డి మల్లిఖార్జునరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఆర్టీసీ సెంట్రల్ బస్‌స్టేషన్ ప్రాంగణంలో బస్సులకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆయన చేతుల మీదుగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బస్సులు తిరుపతి-మదనపల్లె మధ్య రోజుకు 40 సింగిల్స్ తిరుగుతాయన్నారు. టికెట్ ధర పెద్దలకు 300, పిల్లలకు 230 రూ॥గా నిర్ణయించామన్నారు. ఈ బస్సులు మదనపల్లె నుండి తిరుపతికి ఉదయం 5 గంటలు, 6,7,8,9,9-40,10,11, మధ్యాహ్నం 2గంటలు, 1-20,1-40, 2,3, సాయంత్రం 4 గంటలు, 5-20, 6, రాత్రి 7,8,8-20, ఆఖరి సింగిల్ 8-45 గంటలకు, అదేవిధంగా తిరుపతి నుండి మదనపల్లెకు ఉదయం 5 గంటలు, 6,7,7-40,8-20,9,10,11, మధ్యాహ్నం12-20,1,2, 2-20,3, సాయంత్రం 4,5,6,6-30, రాత్రి 7,8,8-45 గంటలకు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ విద్యుత్ ఏసి బస్సుల్లో ప్రయాణం చాలా సౌకర్యవంతంగా, సుఖంగా ఉంటుంది కాబట్టి ప్రయాణీకులు వీటిలో ప్రయాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానందరెడ్డి, డిపిటిఓ జితేంద్రనాథ్‌రెడ్డి, డిప్యూటీ సిటిఎం భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ సిఎంఈ నరసింహులు, బస్‌స్టేషన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ డి.రామచంద్రనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

**బి.సి.ల అభ్యున్నతికి సహకరించి..**

## బి.పి మండల సిఫారస్సులను అమలు చేయాలి

**-పవన్ కళ్యాణ్ కోరిన బడి సుధా యాదవ్**



తిరుపతిరూరల్, జూలై17 ప్రభాతవార్త: బి.సి.ల అభ్యున్నతి కోసం బి.పి. మండల్ ప్రతిపాదించిన సిఫార్సులను అమలు చేయాలని, బి.సి.సమస్యలను జనసేన పార్టీ మెనిఫెస్టోలో పొందుపరచాలని జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను బి.సి.ఫోరం కన్వీనర్, పుదిపట్ల గ్రామ సర్పంచ్ బడి సుధా యాదవ్ కోరారు. తిరుపతి పర్యటనకు విచ్చేసిన పవన్ కళ్యాణ్‌ను సోమవారం రేణిగుంట ఎయిర్‌పోర్టులో కలిసి వినతిపత్రం సమర్పించారు. బి.సి. అభ్యున్నతికి బి.పి. మండల్ ప్రతిపాదించిన 40 సిఫార్సులను ఇప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదన్నారు. బి.సి. జనాభా దామాషా ప్రకారం బి.సి.లకు 52శాతం విద్యా, ఉద్యోగాలలో రిజర్వేషన్స్ అమలు చేయాలన్నారు. చట్టసభల్లో బి.సి.లకు రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులైన బి.సి.లకు పదోన్నతులలో రిజర్వేషన్ కల్పించి, ఉద్యోగ కల్పనలో బి.సి.లకు రిజర్వేషన్ కల్పించాలన్నారు. బి.పి.మండల్ సిఫారస్సు ను జనసేన మేనిఫెస్టోలో పొందుపరచాలని కోరారు. బి.సి.ల అభ్యున్నతికి కృషి చేస్తానని పవన్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## కన్నుల పండువగా శ్రీసీరాముల వారి కళ్యాణ వైభవం



చంద్రగిరి, జూలై 17 ప్రభాతవార్త: స్థానిక టిటిడి అనుబంధ శ్రీ కోదండరామస్వామి వారి ఆలయంలో సోమవారం పునర్వసు నక్షత్రంను పురస్కరించుకుని శ్రీసీతారాముల కళ్యాణ వైభవాన్ని ఆలయ అర్చకులు కన్నుల పండువగా జరిపించారు. చారిత్రాత్మక రాముల వారి ఆలయ ంలో స్వామివారికి ప్రతి నెల పునర్వసు నక్షత్రం రోజున కళ్యాణోత్సవం నిర్వహిస్తున్నారు. ఇందు లో భాగంగా స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాల అర్చనాధి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. ఉదయం 10 నుండి 11 గంటల మధ్యన స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ కె.శ్రీనివాసులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కె.గోపాలకృష్ణ, ప్రధాన అర్చకులు శ్రావన్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

## ముంగిళ్లలోకే సేవలు - మంత్రి




నగరి, జూలై 17 ప్రభాతవార్త: దేశ చరిత్రలోఎన్నడూ లేని విధంగా ప్రజలందరికి పూర్తి స్థాయిలో మేలు చేయాలన్న దృఢ సంకల్పంతో అర్హులందరికీ అండగా నిలిచే సేవా యజ్ఞాన్ని జగనన్న సురక్షతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించారని మంత్రి రోజా అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధి కేవీపీఆర్ పేటలో నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంప్‌లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సచివాలయ పరిధిలో సురక్షలో నమోదు చేసుకున్న 217 ఇంటగ్రేటెడ్, 219 మందికి ఆదాయ ధృవీకరణ పత్రాలు, జగనన్న ధృవీకరణ పత్రాలు 9 మందికి, వివాహ ధృవీకరణ పత్రాలు ఇద్దరికి అంటూ 455 మందికిసర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయపరిధిలో సంక్షేమం అభివృద్ధికి రూ.20.72 కోట్లు వెచ్చించామన్నారు. 72 మందికి ఇళ్ల నిర్మాణానికి రూ.1.29 కోట్లు ప్రభుత్వం వెచ్చించిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నీలమేఘం, వైస్ చైర్మన్ బాలన్, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ దయానిధి, కౌన్సిలర్లు గంగాధరం, బీడీ భాస్కర్, భూపాలన్, ఇంద్రయ్య, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, మున్సిపల్ డీఈ నరేష్, మెప్మా టీఎల్ఎం సునీత, మున్సిపల్ పార్టీ కన్వీనర్ బీఆర్‌వీ అయ్యప్పన్, కో-ఆప్షన్ సభ్యులు ఆనందకుమార్, ఎల్లప్పరెడ్డి, హమీద్, సచివాలయ సిబ్బంది, వలంటీరు, పార్టీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రేమ పెళ్లికి ఒప్పుకోలేదని... ప్రియురాలి తల్లిదండ్రులపై ప్రేమోన్మాది దాడి

**- తీవ్ర గాయాలు**



వెంకటగిరి, జులై 17, ప్రభాతవార్త: ప్రేమోన్మాది ప్రేమ వివాహానికి పెద్దలు ఒప్పుకోలేదని ప్రియురాలి తల్లిదండ్రులపై ప్రియుడు గిరి ఇనుపరాడ్లతో విచక్షణారహితంగా దాడి చేసి గాయపరిచాడు. గాయపడ్డ బాలిక తండ్రి పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి ఆసుపత్రికి పోలీసులు తరలించారు. బాలిక తల్లిదండ్రులు డక్కిలిలో నివాసం ఉంటున్నారు. బాలికకు వేరే పెళ్లి చేస్తారని గిరి వారి తల్లిదండ్రులు ఇంట్లో ఉండగా ఇనుపరాడ్డుతో కొట్టి గాయపరిచారు. పరారీలో ఉన్న ప్రియుడు గిరి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ప్రియురాలి తల్లిదండ్రులు తులసి జగదీష్, తులసీ సుజాతలకు తీవ్ర గాయాలయ్యాయి. తండ్రి జగదీష్ పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వేనాడు దర్గా వద్ద రద్దీ.. రద్దీ



తడ, జూలై 17 ప్రభాతవార్త : తడ మండలం వేనాడు దీవిలో ఆదివారం రాత్రి నుంచి భక్తులు రద్దీ ఎక్కువైంది. ఆదివారం రాత్రి అమావాస్య ప్రారంభం కావడం, సోమవారం రాత్రి వరకు కొనసాగడం వల్ల తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు నుంచి సైతం భక్తులు ఎక్కువ సంఖ్యలో తరలివచ్చారు. సోమవారం ఉదయం మరింత రద్దీ పెరిగింది. గ్రామస్థులు కొంత చొరవ తీసుకొని ఏర్పాట్లు చేశారు. అక్కడున్న ఖాళీ ప్రదేశంలో చెట్ల కింద విశ్రమించి తాము తెచ్చుకున్న ఆహార పదార్థాలు భుజించి ఖాదర్‌వలి దర్గాను దర్శించుకొని వెళ్లారు. ఇక్కడ శతాబ్దాల చరిత్ర కలిగిన అల్లాతాత దర్గా ఉన్న కారణంగా ప్రతి అమావాస్య రోజు జనం విరివిగా వస్తుంటారు. అల్లాతాత దర్గాతో పాటు సమీపంలోని చిన్న దర్గాను కూడా భక్తులు శ్రద్ధాసక్తులతో దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

## అలసత్వం లేకుండా సకాలంలో పరిష్కారం చూపాలి : జిల్లా కలెక్టర్



తిరుపతి కలెక్టరేట్, జులై 17 ప్రభాతవార్త : స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణీత కాలవ్యవధి లోపల ప్రజలు అందజేసిన సమస్యల అర్జీలకు అర్థవంతంగా పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డికె బాలాజీతో కలిసి స్పందన గ్రీవెన్స్ అర్జీలను స్వీకరించారు. వీరితో పాటు డిఆర్‌ఓ కోదండ రామిరెడ్డి ఎస్‌డిసిలు భాస్కర్ నాయుడు, శ్రీనివాసులు జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. స్పందన ఆన్‌లైన్ నమోదుతో రసీదులు అందించారు. స్పందన కార్యక్రమంలో మొత్తం అర్జీలు 178 వినతులు రావడం జరిగిందని జిల్లా అధికారులు వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాల్సిందిగా స్పందనకు హాజరైన వివిధ శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

## జాడలేని చినుకు.. కరవైన కునుకు..

కోట, జులై 17 ప్రభ్యాతవార్త : తొలకరి పలకరించలేదు., కార్తెలన్నీ కరిగిపోయాయి మేఘాలు ఊరిస్తున్నా.. వాన కురవలేదు. అల్పపీడనం బలహీనపడింది. ఖరీఫ్ ప్రారంభమై 45 రోజులు గడిచిపోయింది. ఇప్పటికీ చినుకు పడలేదు. జులై 15 తర్వాత వేరు సెనగ విత్తు వేసినా దిగుబడి రాదని వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు. నిత్యం ఆకాశం వైపు ఎదురు చూపులు తప్పడం లేదు. అన్నదాతల ఆశలు ఆవిరవుతున్నాయి. నేల దుక్కులు, విత్తనం సిద్ధం చేసుకుని దిక్కులు చూస్తున్నారు. జూన్ 12 న నైరుతి పవనాలు ప్రవేశించాయి. మృగశిర, ఆరుద్ర, కార్తెలు ముగిసిపోయాయి. ఈనెల 6న పునర్వసు కార్తె ప్రారంభమై ఈ నెల 20 వ తేదీ నాటికి ముగియనుంది. ఈవన్నీ 15 రోజల కార్తెలు .ఒక్క కార్తెలో కూడా పదునైనా వర్షం పడలేదు. ఈ సారి పంటల సాగుకు ప్రశ్నార్ధకంగా మారింది. మండలాల్లో లోటు వర్షపాతం యమోదైంది. పంటల సాగు విస్తీర్ణం పడిపోయింది. ఇప్పటికే ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రణాళికలతో సిద్ధంగా ఉన్నామని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

## సునామిలా శివభక్తులు...వందల సంఖ్యలో అభిషేకాలు



శ్రీకాళహస్తి, జులై 18 ప్రభాతవార్త : అమావాస్య, పౌర్ణమి రోజు అంటే శివయ్య సన్నిధికి భక్తుల తాకిడి అత్యధికంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో సోమవారం అమావాస్య సందర్భంగా ఇసుకేస్తే రాలనంత రద్దీచోటు చేసుకుంది. ఆలయ ఇఒ కె వి.సాగర్‌బాబు మహిమాన్వితమైన రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకున్నారు. చైర్మెన్ అంజూరు శ్రీనివాసులు భక్తులకు ఇబ్బంది లేకుండా దర్శనాలకు ఏర్పాట్లు చేసారు. దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయం మూడు రోజుల నుంచి భక్తులతో కిట కిట లాడింది. సోమవారం ఉదయం స్వామి అమ్మవార్ల అభిషేకాలకు వందలాది మంది హాజరయ్యారు. సాధారణంగా ఇక్కడి ఆలయంలో అభిషేకాలకు పది మందిని మాత్రమే అనుమతించాలి. రాహుకేతుదోష నివారణ పూజలు 7500దాటాయంటే ఇక రద్దీ అర్థమౌతుంది. సోమవారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే స్వామి అమ్మవార్ల పూజలకు విశేష సంఖ్యలో హాజరయ్యారు. ఇక అభిషేకాల పరిస్థితి పరిశీలిస్తే 222 జరిగాయి, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు 66 రాహుకేతుదోష నివారణ పూజలు 7500 ప్రత్యేక దర్శన టిక్కెట్లు ద్వారా 5200 మంది ప్రవేశించారు.

**చైర్మెన్ వ్యక్తిగత పర్యవేక్షణ:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల రద్దీని ముందుగానే గుర్తించిన చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు సమీక్షించుకున్నారు. విమర్శలు, ఆరోపణలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం పొద్దుపొడవక ముందే ఆయన క్యూలైన్ల వద్ద దర్శనం ఇచ్చారు. క్యూలైన్లలోభక్తులు ఇబ్బంది పడకుండా చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఇటు అటు తిరుగుతూ భక్తులను సత్వరంగా దర్శనాలకు పంపారు. ముఖ్యంగా ఆయన కంచుగడప వద్ద నిల్చొని 'దళారుల ఆట కట్టించారని' చెప్పవచ్చు. అక్కడ నిలబడటంతో సెక్యూరిటి, హోంగార్డులు ధైర్యంగా దళారులను ప్రవేశించకుండా విధులు నిర్వహించారు.